
ఈనాడు
మంచిర్యాల
గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు



సంతోషంగా పండగలు చేసుకోవాలి

గణపతి నవరాత్రి ఉత్సవాలు, బక్రిద్ పండగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మంచిర్యాల పట్టణంలో మతపెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

అక్రమార్కులే ఆదాయ మార్గాలు..

జీరో దందా సాగించే వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు

భూ వివాదాల్లో తలదూర్చుతున్న పోలీసులు

బొగ్గు, బంగారం, ఇసుక, పాత ఇనుము వ్యాపారాలే లక్ష్యంగా వసూళ్లు

స్టేషన్లవారీగా నేతలకు మామూళ్లిచ్చి పోస్టింగులు

ఈనాడు–ఆదిలాబాద్

జీరో దందాకు అడ్డాగా చెప్పుకొనే మంచిర్యాల జిల్లాలో పోలీసుల తీరు రోజు రోజుకు దిగజారుతోంది. అక్రమాలను అరికట్టి చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు కొందరు డబ్బుల వసూళ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. నెలవారీ మామూళ్లు నిర్ణయించడం.. అవి చాలవనుకున్నప్పుడు కేసులతో బెదిరించి భారీగా దండుకుంటున్నారు. భూములకు ధరలు పెరగడంతో వాటిలో చిన్నపాటి వివాదాలొచ్చినా రెవెన్యూశాఖ కంటే ముందే పోలీసులే రంగంలోకి దిగుతున్నారు. శాంతి భద్రతల మాటున కొందరు పోలీసులు సాగిస్తున్న దందా అంతా ఇంతా కాదు. లేఖలు ఇవ్వడానికి మామూళ్లు తీసుకునే పాలకులు .. ప్రజలను పీడిస్తున్నా ప్రశ్నించే పరిస్థితిలేకుండాపోయింది.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఒకప్పటి మంచిర్యాల జిల్లాల విభజన తర్వాత రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోకి వెళ్లింది. జిల్లాలో స్థిరాస్థి, బొగ్గు, ఇసుక, పాత ఇనుము, బంగారం, నిషేధిత గుట్కా వంటి వ్యాపారాలు జోరుగా సాగుతాయి. వాటిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాల్సిన కొందరు పోలీసులు ఆ వ్యాపారులతో మిలాఖత్ అయి ఆదాయ వనరులుగా మర్చుకుంటున్నారు. వ్యాపారులను భయపెట్టి మరోసారి తప్పుచేయకుండా చూడాల్సి ఉన్నా.. మామూళ్లు తీసుకోవడంతో అక్రమాలు రోజురోజుకు భారీగా పెరిగిపోతున్నాయి. సామాన్యుడి గోడు పట్టించుకోని పోలీసులు ఆదాయం వచ్చే వాటిపైన కనురెప్ప వాల్చకుండా నిఘా పెడుతున్నారు. ప్రాంతాల వారీగా ఆదాయం వచ్చే పోలీసు స్టేషన్లకు ఎంత ఖర్చయినా సరే పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారు. ఆ తర్వాత నెలవారీగా మామూళ్లను నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

భూ వివాదాలను లక్ష్యంగా చేసుకుని...

సివిల్ తగాదాల్లో తలదూర్చవద్దనే పోలీసు ఉన్నతాధికారులు పదేపదే హెచ్చరిస్తున్నా.. కొందరు పోలీసులు అదేపనిగా వ్యవహరిస్తున్నారు. ఓ తహసీల్దార్ తప్పుడు పత్రాలిచ్చినా, అక్రమంగా వెంచర్లు వేసినా, ప్రభుత్వ భూములు కబ్జా చేసినా.. చర్యలు తీసుకోవడానికి ఆపైన ఆర్డీవో, డీఆర్వో, సంయుక్త పాలనాధికారి, జిల్లా పాలనాధికారులు ఉంటారు. ఏదైన ఘర్షణ వాతావరణం నెలకుని శాంతిభద్రతలకు నష్టంకలిగినప్పుడు మాత్రమే రంగప్రవేశం చేయాల్సిన పోలీసులే భూ వివాదాల్లో చక్రం తిప్పుతున్నారు. ఫిర్యాదు రాగానే వాళ్ల వద్ద మామూళ్లు తీసుకుని విచారణ పేరుతో అవతలి వ్యక్తులకు నరకం చూపించడం పరిపాటిగా మారింది. మాటవినకుంటే లాఠీలతో భయపెడుతున్నారు. దీంతో రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లకుండా పోలీసు స్టేషన్లలోనే సెటిల్మెంట్లు చేసుకుంటున్నారు. మంచిర్యాల జిల్లాలో భూ వివాదాలు, స్థిరాస్థి వ్యాపారాల్లో రెవెన్యూ అధికారుల కంటే పోలీసులపాత్ర ఎక్కువైందనే విమర్శలున్నాయి. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, చెన్నూర్, మందమర్రి మండలాల్లో పోలీసులు భూ వివాదాల్లో ఎక్కువగా తలదూర్చుతున్నట్లు మిగతా 7లో..


కార్మిక సంఘాల సమావేశంలో ప్రసంగాలు వింటున్న కార్మికులు

పొత్తుల ఎత్తులు!

వ్యూహరచనలో కార్మిక నేతలు జాతీయ సంఘాల్లో చర్చ

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: **సింగరేణిలో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రకటన వెలువడటంతో ప్రధాన సంఘాలన్నీ కార్మికుల మదిని దోచుకోవడం ఎలా? అనే అంశంపై దృష్టి కేంద్రీకరించాయి. ఈ ఎన్నికలు అన్ని సంఘాలకు ప్రతిష్ఠాత్మకమయ్యాయి. అధికార పార్టీ తెరాస అనుబంధ తెబొగకాసం తన గుర్తింపును నిలబెట్టుకోవాలనే కృతనిశ్చయంతో ఉంది. జాతీయ సంఘాలు సింగరేణి ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేయాలనే పట్టుదలతో ఉన్నాయి. కార్మిక సంఘాలు వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగి ప్రచారాస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.**

తెలంగాణలోని ఆరు జిల్లాల్లో 11 ఏరియాలుగా విస్తరించిన సింగరేణిలో గుర్తింపు హోదా దక్కించుకోవడానికి జాతీయ కార్మిక సంఘాలతోపాటు, తెబొగకాసం వ్యూహరచనలో నిమగ్నమయ్యాయి. గత ఎన్నికల్లో విజయ ఢంకా మోగించిన తెబొగకాసం చేసిన పనులు, సాధించిన హక్కులు చూపించి మరోసారి కార్మికుల్లో పట్టు సాధించాలనే పంతంతో ఉంది. తెబొగకాసం మాతృసంస్థ అయిన తెరాస అధికారంలో ఉండటం, ఇతర సంఘాల కన్నా ఎక్కువ మొత్తం కార్యకర్తల బలం ఉండటం తనకు కలిసి వస్తుందనే ధీమాతో ఉంది. తెబొగకాసంను ఈసారి ఓడించకుంటే తమ ఉనికికే భంగం వాటిల్లుతుందనే ఉద్దేశంతో జాతీయ కార్మిక మిగతా 7లో..

ఊడ్చుకోవడం దగ్గర నుంచి అన్నీ చిన్నారులే..

పాఠశాలను ఊడుస్తున్న ఈ బాలికలు దండేపల్లి మండలంలోని దమ్మన్నపేట గిరిజన పాఠశాలకు చెందినవారు. ఇక్కడ 26 మంది విద్యార్థులు ఉండగా ఉదయం బడికి రాగానే తాళాలు తీయడం దగ్గర నుంచి అన్నీ పనులు వీరే చేసుకోవాలి. పాఠశాలను శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, మధ్యాహ్నభోజనం ముగిసిన తర్వాత మళ్లీ తరగతులను శుభ్రం చేసుకోవడం, తాగునీటికి అవసరమైన నీరు తెచ్చుకోవడం ఇలా అన్ని పనులు చిన్నారులే చేసుకోవాల్సి వస్తోంది.



చదువుతో పాటు అన్ని పనులు చేసుకోవాల్సిందే..

మొక్కలకు నీళ్లు పోస్తున్న ఈ విద్యార్థులు కుంటలగూడకు చెందినవారు. వీరు రోజూ బడికి రాగానే తాళాలు తీసి బడిని ఊడ్చి మొక్కలకు నీళ్లు పోస్తుంటారు. స్కావెంజర్ లేకపోవడం వల్ల చిన్నారులే మొక్కలకు నీళ్లు పోయడం, ఇతర పనులు చేసుకుంటున్నారు. ఈపాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికుడిని నియమిస్తే తాగునీరు అందుబాటులో ఉండడంతో పాటు బడిని మరింత శుభ్రంగా ఉంచుకోవచ్చు.



గిరి బడులు.. స్వచ్ఛతకు దూరం!

పారిశుద్ధ్య కార్మికులు లేక విద్యార్థులతోనే పనులు

మైదాన పాఠశాలల్లోనే స్కావెంజర్లు

దండేపల్లి, న్యూస్‌టుడే

రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాల పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్న ప్రభుత్వం గిరిజన విద్యాసంస్థలపై చిన్నచూపు చూస్తోంది. అభివృద్ధికి దూరంగా.. ఎక్కడో తండాల్లో ఉండే గిరిజన పాఠశాలలపై శీతకన్ను ఉంచుతోంది. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఏకరూప దుస్తులే లేవు. పాఠశాలల్లో వివిధ పనులు చేయడానికి అవసరమైన కార్మికులను (స్కావెంజర్స్) గిరిజన పాఠశాలలలో నియమించలేదు. మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ, ప్రభుత్వ తదితర పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించిన ప్రభుత్వం.... అత్యంత పేదలు, అభివృద్ధికి దూరంగా ఉండే గిరిజన తాండాల్లో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మాత్రం నియామకాలు చేపట్టలేదు. దీంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'న్యూస్‌టుడే' కథనం..



గిరిజన సంక్షేమ పాఠశాల

పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించకపోవడంతో అన్ని పనులు విద్యార్థులే చేసుకోవాల్సి వస్తోంది. ఉదయం బడికి రాగానే తాళాలు తీసి తరగతి గదిని శుభ్రం చేసుకోవాలి. మొక్కలున్న చోట నీరు పోయడం, తాగు నీరు తెచ్చిపెట్టుకోవడం ఇలా ప్రతి పని చేసుకోవాలి. మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10 మంది విద్యార్థులు, అంతకంటే ఎక్కువ ఉన్నచోట ఒక కార్మికుడిని నియమించారు. కాని వీటిలో మాత్రం ఆ ఊసే లేదు. జిల్లాలో 56 గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఇందులో మిగతా 7లో..



సమావేశంలో మాట్లాడుతున్న తెబొగకాసం ఏరియా కార్యదర్శి నర్సయ్య

అనుమతి లేకుండా పింఛను మినహాయింపు నిలిపివేయాలి

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన వేతనాల నుంచి ఏలాంటి ముందస్తు అనుమతి, సమాచారం లేకుండానే ఏడు శాతం పింఛను పేరుతో డబ్బులను మినాహాయించడం సమంజసం కాదని తెబొగకాసం ఏరియా కార్యదర్శి కె.నర్సయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి తెబొగకాసం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇతర నాయకులతో కలిసి మాట్లాడారు. కార్మికుల వేతనాల నుంచి ఏడు శాతం పింఛను మినహాయించాలని జాతీయ సంఘాలు కోల్‌ఇండియా యాజమాన్యంతో కుమ్మక్కయి నిర్ణయం తీసుకోవడం అన్యాయం అన్నారు. జాతీయ సంఘాలు కార్మికులకు చేసే మోసాన్ని గ్రహించాలని ఆయన అన్నారు. కార్మికులకు పదోవేతన సంఘం ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలన్నారు. పింఛను పదోవేతన ఒప్పందం నుంచి 50 శాతం పెంచాలన్నారు. కార్మికులకు పించను 50 శాతం పెంచాలని తమ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కె.కుమారస్వామి, ఎ.సత్యనారాయణ, ఎం.రమేష్, జి.రాజలింగు, భాస్కరాచారి, ఎస్.తిరుపతి పాల్గొన్నారు.



హెచ్చెమ్మెస్‌లో చేరుతున్న కార్మికుడికి కండువా వేస్తున్న రియాజ్ అహ్మద్

డిమాండ్ల సాధనకు ముందుకు రాకుంటే సమ్మెలోకి వెళ్తాం

హెచ్చెమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: 10వ వేతన సంఘం చర్చల్లో జాతీయ కార్మిక సంఘాలు సూచించిన డిమాండుల సాధనకు కోలిండియా యాజమాన్యం ముందుకు రాకపోతే దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని హెచ్చెమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం సీసీసీ నస్పూర్ కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వేతన సంఘం చర్చలపై ఇతర సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, 21 శాతం వేతనాలు పెంచేందుకు యాజమాన్యం ముందుకు రాలేదన్నారు. భూగర్భ గనుల అలవెన్సును తగ్గించి, గత వేతన సంఘంలోని 4 శాతం ప్రత్యేక అలవెన్సును రద్దు చేయాలని యాజమాన్యం ప్రయత్నిస్తుందన్నారు. చివరిసారిగా జరిగిన చర్చల్లో 21 శాతం వేతనాల పెంపు, 4 శాతం ప్రత్యేక అలవెన్సు, 12.5 భూగర్భ గనుల అలవెన్సు ఇవ్వాలని తాము యాజమాన్యానికి సూచించామన్నారు. గురువారం దిల్లీలో జరిగే చర్చల్లో ఈ డిమాండులనే యాజమాన్యం ముందు పెడుతామని వాటికి అంగీకారం తెలపకపోతే దేశవ్యాప్త సమ్మె చేస్తామని ఆయన తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని, ఎవరితో ఎలాంటి పొత్తులు పెట్టుకోమన్నారు. తమ సంఘాన్ని గెలిపిస్తే ఇదివరకు పెండింగ్‌లో ఉన్న డిమాండులను హెచ్చెమ్మెస్ నెరవేరుస్తుందని ఆయన తెలిపారు. అనంతరం ఏరియాకు చెందిన పలువురు కార్మికులు రియాజ్ అహ్మద్ సమక్షంలో హెచ్చెమ్మెస్‌లో చేరారు. ఈ సమావేశంలో హెచ్చెమ్మెస్ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం రమేష్, నాయకులు తిరుపతిగౌడ్, తిప్పారపు సారయ్య, నర్సింగరావు, కాల్వ శ్రీనివాస్, తిప్పని మల్లయ్య, జాడి బాణయ్య, నర్సయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఐజీ

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ రేంజ్ డీఐజీ రవివర్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ విక్రంజీత్ దుగ్గల్‌తో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న డీఐజీ నేరుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోకి వెళ్లారు. సర్కిల్ పరిధిలోని 4 పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. హరితహారం పథకంపై ఆరా తీయగా 2.48 లక్షల మొక్కలు నాటినట్లు సీఐ రాంచంద్రరావు సమాధానం చెప్పారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఐజీకి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. డీఐజీ వెంట డీసీపీ జాన్‌వెస్లీ, ఇన్చార్జి ఏసీపీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి బయటకు వస్తున్న డీఐజీ రవివర్మ

పండగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సీపీ విక్రమ్‌జిత్, పాలనాధికారి ఆర్వీ కర్ణన్

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: లౌకిక దేశంలో ఎవరి మతాన్ని వారు గౌరవించుకుంటూ పండగలను ధర్మబద్ధంగా నిర్వహించుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గణపతి నవరాత్రి ఉత్సవాలు, బక్రిద్ పండగలను పురస్కరించుకొని స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో మతపెద్దలతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో జరుపుకొనే వినాయక చవితి, బక్రిద్ ఒకే సమయాల్లో వస్తున్నాయని ఈ క్రమంలో ఎప్పటి మాదిరి ఒకరికి ఒకరు సహకరించుకుంటూ సమన్వయంతో శాంతియుతంగా పండగలు నిర్వహించుకోవాలన్నారు. జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్‌రూంలను ఏర్పాటు చేస్తున్నామని, నిర్వాహకులు ఏలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు, మండపాల నిర్వాహకులు మట్టి గణపతుల విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ప్రతి మండపంలో ప్రసాదంతో పాటు భక్తులకు మొక్కలను అందించి ఆయా ప్రాంతాల్లో హరితవనాలను పెంచేలా ప్రోత్సహించాలని కోరారు. మున్సిపల్, రవాణా, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ అధికారులు ఒక బృందంగా ఏర్పడి నిమజ్జన రోడ్డుమార్గాలను సూచిస్తారని విగ్రహాలు అదే మార్గంలో వెళ్లేందుకు నిర్వాహకులు సహకరించాలన్నారు. బక్రిద్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులు మాంసాహారాలను బహిరంగ ప్రదేశాలలో కాకుండా మున్సిపల్, పంచాయతీ అధికారులు సూచించిన స్థలాలలో వేయాలని సూచించారు. అంతకుముందు జిల్లాలోని హిందూ పరిరక్షణ సమితి, ముస్లిం మతపెద్దలు పండగల సందర్భంగా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలను అందించారు. సమావేశంలో డీసీపీ జాన్‌వెస్లీ, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు చెన్నయ్య, కవిత, ఇన్చార్జి డీఆర్వో ప్రియాంక, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్యామలదేవి, వీరన్న, మున్సిపల్ ఛైర్మన్ వసుంధర, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు, సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



పాల్గొన్న జిల్లాలోని మతపెద్దలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

వేతన ఒప్పందంపై నేడు కీలక చర్చలు

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: బొగుగని కార్మికుల పదో వేతన ఒప్పందంపై గురువారం దిల్లీలో జరగనున్న చర్చలు కీలకం కానున్నాయి. కార్మికుల వేతనాలు ఏమేరకు పెరుగుతాయనేది సంఘాల నేతల్లోనూ ఉత్కంఠగా ఉంది. కోల్ ఇండియాలో 23 శాతం వాటాలు ప్రైవేటువారి చేతుల్లో ఉండటమే చర్చల్లో ప్రతిష్ఠంభనకు దారి తీస్తున్నాయి. వేతన చర్చల్లో యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, ఒకవైపు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ, మరోవైపు ప్రైవేటు డైరెక్టర్లు చర్చల్లో జోక్యం చేసుకుంటుండటంవల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వేతన కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కోల్ ఇండియా వద్ద రిజర్వులో ఉన్న నిధుల్లో రూ. 55వేల కోట్లను కేంద్రం బైబ్యాక్ పేరిట లాక్కోవడంతో, తనవద్ద రూ.8 వేల కోట్లు మాత్రమే ఉన్నాయని యాజమాన్యం పదేపదే స్పష్టం చేస్తోందని నాయకులు వాపోయారు. బొగ్గు పరిశ్రమలో ఎక్కువ మొత్తం వేతనాలు పెంచితే, దాని ప్రభావం ఇతర ప్రభుత్వరంగ పరిశ్రమలపై పడుతుందని, దేశంలోని అన్ని సంస్థలు ఇదే అంశాన్ని ప్రస్తావిస్తాయంటూ కేంద్రం ఒత్తిడి చేస్తోంది. మరోవైపు వేతనాలు పెంచితే, కోల్ ఇండియాలో వాటాలు కొనుగోలు చేసిన ప్రైవేటు పెట్టుబడిదారులకు లాభాలు ఎలా వస్తాయనే కోణంలో నిరసన వ్యక్తం అవుతోంది. ఈనెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు రాంచీలో జరిగిన వేతన కమిటీ చర్చల సందర్భంగా ప్రైవేటు భాగస్వాములు పదేపదే చర్చలకు అడ్డుతగలడంతో 21 శాతం కనీస పెరుగుదలతో అవగాహన ఒప్పందం దిశగా సాగిన చర్చలు విఫలమయ్యాయని సమాచారం. గురువారం జరిగే చర్చల్లో ప్రైవేటుభాగస్వాముల ప్రభావం, కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ జోక్యం ఏమేరకు ఉంటుందనే అంశం ఆధారంగానే చర్చలు ఫలవంతం అయ్యేది, కానిది తేలే అవకాశం ఉంది.

కేకే ఓసీపీలో బయటపడిన బొగ్గు నిక్షేపాలు

నేడు సింగరేణి డైరెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం

మందమర్రి: మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని ఉపరితల బొగ్గు గనిలో బొగ్గు నిక్షేపాలు బయటపడ్డాయి. ఈ మేరకు గురువారం సింగరేణి యాజమాన్యం అధికారికంగా ప్రకటించనుంది. ఏరియాకు తలమానికంగా మారనున్న కేకు ఓసీపీలో బొగ్గు నిక్షేపాలు బయటపడటంతో ఇక బొగ్గు ఉత్పత్తి చేసేందుకు యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఏటా 2 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఓసీపీని ఏర్పాటు చేశారు. మే మాసంలో మట్టి వెలికితీత పనులు ప్రారంభించారు. అనతికాలంలోనే నిక్షేపాలు బయటపడటంతో యాజమాన్యం భరోసా పెంచుకుంది. గనిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైతే ఏరియాలోని నష్టాలను తగ్గించడంతో పాటు పెద్ద ఎత్తున బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసే అవకాశం కలగనుంది. గనిలో నాలుగో సీములో బొగ్గు నిక్షేపాలను ప్రాథమికంగా గని యాజమాన్యం గుర్తించింది. ఇదే విషయాన్ని 'ఈనాడు' ఈనెల 18న 'సింగరేణి సిగలో మరో నగ' అనే శీర్షిక వచ్చిన వార్తతో బహిర్గతం చేసిన విషయం తెలిసిందే. 20 సంవత్సరాల జీవితకాలం ఉన్న కేకే ఓసీపీ నుంచి 30.54 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని యాజమాన్యం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం సింగరేణి సంచాలకులు(ఆపరేషన్స్) చంద్రశేఖర్ కె.కె ఓసీపీలో బొగ్గు నిక్షేపాలు బయటపడ్డ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు.

భూదాన భూమి పరిశీలన

మంచిర్యాల పట్టణం: మంచిర్యాల కాలేజీరోడ్డులోని భూదాన యజ్ఞ బోర్డు భూమిని బుధవారం సీఆర్‌పీఎఫ్ అధికారులు పరిశీలించారు. భూదాన బోర్డు భూమి సర్వే నెంబర్లు, విస్తీర్ణం, పొడవు, వెడల్పు వివరాలు రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూదాన భూమి కబ్జాలో ఉన్న స్థలం ఎంత, ఖాళీగా ఉన్న స్థలం ఎంత అనే విషయాలను నమోదు చేసుకున్నారు. గతంలో గోదావరినదిలో వరదనీరు పెరిగినప్పుడు భూదాన భూమికి ఎంత దూరం వరకు నీరు వచ్చింది, గోదావరినది ఎగువ ప్రాంతంలో ఎంత దూరంలో జలాశయం నిర్మించారని వివరాలు సేకరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు భూదానం భూమిలో జిల్లా పాలనాధికారి కార్యాలయం నిర్మించడానికి స్థల పరిశీలన కోసం ప్రభుత్వం పంపించిందా లేక సీఆర్‌పీఎఫ్‌కు సంబంధించిన ఏమైనా భవనాలు నిర్మించడానికి స్థలం కోసం పరిశీలించారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఉప తహసీల్దార్ గోవింద్, ఆర్.ఐ.సుమన్, సర్వేయర్ నర్సింహారాజు పాల్గొన్నారు.



మంచిర్యాలలోని భూదాన భూమి

కమిషనరేట్ పరిధిలో 12 మంది ఎస్సైల బదిలీలు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 12 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ విక్రమ్‌జీత్ దుగ్గల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో అటాచ్ ఎస్ఐగా పని చేస్తున్న పర్శ రమేష్‌ను జైపూర్‌కు, రామగుండం సీఎస్‌బీ అటాచ్ ఎస్ఐగా పని చేస్తున్న ఓంకార్ యాదవ్‌ను పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. జైపూర్ పోలీస్‌స్టేషన్ అటాచ్ ఎస్ఐగా పని చేస్తున్న బి.సంజీవ్‌ను రామగుండం ఎస్‌బీకి, రామగుండం సీసీఆర్‌బీ అటాచ్ ఎస్ఐగా పనిచేస్తున్న జానీపాషాను కాల్వ శ్రీరాంపూర్‌కు, అక్కడ పని చేస్తున్న ఆర్.ఉమాసాగర్‌ను రామగుండం ఎస్‌బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ అటాచ్ ఎస్ఐగా పని చేస్తున్న జి.వినోద్‌కుమార్‌ను మందమర్రి పోలీసు కంట్రోల్ రూంకు(పీసీఆర్), రామగుండం వెకెన్సి ఫర్ రిజర్వ్ (వీఆర్)ఉన్న వి.వెంకన్నను కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు, జన్నారం ఎస్ఐగా పని చేస్తున్న జి.ప్రసాద్‌ను రామగుండం వీఆర్‌కు, నెన్నల పోలీస్‌స్టేషన్ అటాచ్ ఎస్ఐగా పని చేస్తున్న ఎన్.రమేష్‌ను జన్నారం పోలీసుస్టేషన్‌కు, మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న జి.వేణుగోపాల్‌రావును రామగుండం కమిషనర్ క్రైం రికార్డు బ్యూరో (సీసీఆర్‌బీ)కు బదిలీ చేశారు. అదే విధంగా మందమర్రి పోలీస్‌స్టేషన్ అటాచ్ ఎస్ఐగా పని చేస్తున్న ఏ.ప్రదీప్‌కుమార్‌కు అక్కడే బాధ్యతలు కల్పించారు. చెన్నూరు పోలీస్‌స్టేషన్ అటాచ్ ఎస్ఐగా పని చేస్తున్న బి.చందర్‌ను నెన్నెల పోలీస్‌స్టేషన్‌కు నియమించారు.

అక్రమంగా తరలిస్తున్న 3 కిలోల గంజాయి పట్టివేత

గోదావరిఖని: గోదావరిఖనిలో అక్రమంగా రవాణా చేస్తున్న 3 కిలోల గంజాయిని ఒకటో పట్టణ పోలీసులు బుధవారం సాయంత్రం స్థానిక గంగానగర్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన బందం శిల్ప(33) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల జల్సాలకు అలవాటు పడ్డ శిల్వ గంజాయి విక్రయాలు ప్రారంభించాడు. వరంగల్ నుంచి కిలో గంజాయి రూ.4 వేల చొప్పున కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.100 చొప్పున మంచిర్యాల, గోదావరిఖని ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే వరంగల్ నుంచి 3 కిలోల గంజాయిని కొనుగోలు చేసుకుని గోదావరిఖనిలో విక్రయించేందుకు వచ్చిన శిల్వ గంగానగర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు పట్టుకొని విచారించారు. అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయడంతో 3 కిలోల గంజాయి లభించింది. చిన్న చిన్న ప్యాకెట్లు కూడా లభించాయి. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. రూ.30 వేల విలువ చేసే గంజాయిని మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నించిన శిల్వపై కేసు నమోదు అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఎస్ఐలు రమేశ్‌బాబు, దేవయ్యలతో పాటు హెడ్ కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు ఏలియా, జంపయ్య, సదయ్యలు నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేశారని వెల్లడించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణ



ప్రకటనతో ఆనందం.. పట్టుదలతో సాధన

నిరుద్యోగుల్లో ఆశల చిగురింత

జిల్లాలో 2463 పోస్టుల భర్తీకి అవకాశం

పక్కా ప్రణాళికతో ఉద్యోగం ఖాయం

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

ఉన్నత చదువులు చదివి ఎప్పుడు ఏ నోటిఫికేషన్ వస్తుందా అని ఎదురు చూస్తున్న జిల్లా నిరుద్యోగుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన ఆశలు రేకేత్తిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 84,876 పోస్టుల భర్తీకి కార్యచరణ రూపొందించాలని ఆదేశించడంతో నిరుద్యోగులు సంబరపడుతున్నారు. వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలవుతున్నాయి. దీంతో వారు పుస్తకాల దుమ్ము దులిపే పనిలో పడ్డారు. పరీక్షల్లో తమ ప్రతిభ చూపి కొలువు దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరంపై 'న్యూస్‌టుడే' కథనం.

ఎన్నో ఏళ్ల నుంచి ఆయా శాఖల్లో ఉద్యోగుల భర్తీ లేక ఖాళీ పోస్టులు దర్శనమిస్తున్నాయి. దీంతో నిరుద్యోగులు నిరాశలో కూరుకుపోయారు. కొందరు ప్రైవేట్, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. మరి కొందరు ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగం రాకపోతుందా..? సాధించలేకపోతామా..? అని పట్టుదలతో శిక్షణ తీసుకుంటున్నారు. రూ.లక్షలు వెచ్చించి కోచింగ్‌లకు వెళ్తున్నారు. తాజాగా ప్రభుత్వం ప్రకటన వారిలో కొత్త ఉత్సాహం నింపింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలే పెట్టుబడిగా ఆశల కొలువుకు సమాయత్తం అవుతున్నారు.



మానవుడి ప్రతిభాపాటవాలు సూర్యకిరణాల్లా విస్తరిస్తాయి. అవి కేంద్రీకృతమైతే ప్రసరిస్తాయి. భయం ఉన్న వారు ఏ పనినీ సాధించలేరు.

- స్వామి వివేకానంద

ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదల

వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపుతున్న నేపథ్యంలో జిల్లాలో ఏ శాఖలో ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయనే లెక్కల్లో అధికారులు నిమగ్నమయ్యారు. దాదాపు 2463 పోస్టులు భర్తీ కానున్నట్లు చెబుతున్నారు. అటవీ, ఆర్టీసీ, రెవెన్యూ, వైద్యఆరోగ్య, నీటి పారుదల, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్య, పశుసంవర్ధక, పురపాలిక, అటవీ తదితర శాఖల్లో ఖాళీల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదల అయ్యాయి.

ఆంగ్లం అంటే భయం వద్దు..

ఆంగ్లం అంటే తెలుగు మాధ్యమం అభ్యర్థులు భయపడటం సహజం. దీన్ని అధిగమించి విషయం పరిజ్ఞానం పెంపొందించుకోవాలి. గతంలో మాదిరిగా వ్యాకరణం మీదనే ఆధారపడితే విజయానికి చేరువ కాలేరు. పాఠ్యాంశాలలో వ్యాకరణాన్ని అనుసంధానం చేసుకోవాలి. ఎక్కువగా బోధనా పద్ధతులు, మూల్యాంకనాలపై పట్టు సాధించాలి. అప్పుడే ఆంగ్లంలో పట్టు సాధించగలుగుతారు.

దినపత్రికలు ఎక్కువగా చదవాలి..

పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే దినపత్రికలు ఎక్కువగా చదవాలి. వాటిలో వచ్చిన ప్రధాన అంశాలను ఎప్పటికప్పుడు రాసుకోవాలి. నిత్యం పత్రిక పఠనం వల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. పోటీ పరీక్షల్లో 40 శాతం బయటి నుంచి ప్రశ్నలు అడుగుతారు. అవి పత్రికల్లోనే లభ్యమవుతాయి.



సర్కారీ కొలువు సాధనకు చక్కని వేదిక గ్రంథాలయం

పోటీ ప్రపంచంలో ఉద్యోగ సాధన అంటే ఆషామాషీ కాదు. పదో తరగతి అర్హతతో సాధించే చిన్న ఉద్యోగాలకు సైతం ఇంజినీరింగ్, పీజీ కోర్సులు చదివిన వారు పోటీ పడుతున్నారు. ఉద్యోగ సాధనలో ప్రతి మార్కు విలువైందే...అనంత పరిజ్ఞానం ఉంటేనే పోటీ పరీక్షల్లో జయించగలం. అందుకోసం ఎన్నో పుస్తకాల నుంచి విషయాలను సంగ్రహించాల్సి ఉంటుంది. అందరికి అన్ని పుస్తకాలు కొనుగోలు చేసే ఆర్థిక సామర్థ్యం ఉండదు. పేద కుటుంబాలకు చెందిన అభ్యర్థులు సర్కారీ కొలువు సాధనకు గ్రంథాలయాలను ఎంచుకొని భవితకు బాటలు వేసుకోవాలి.

అభ్యర్థులను చూసి భయపడొద్దు

ఒక్క ఉద్యోగానికి ఇంత మంది దరఖాస్తు చేసుకున్నారు..అని అభ్యర్థులను చూసి భయపడొద్దు. వందల్లో ఉన్న పోస్టులకు లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి.. ఇక మనకు ఉద్యోగం వచ్చినట్లే అన్న భావన పొరపాటున కూడా మనసులోకి రానివ్వొద్దు. ప్రయత్నిస్తే ఫలితం మన వెంటే అన్న నానుడి మరచిపోవద్దు. సాధనతో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. దీనిని గుర్తుంచుకొని ప్రయత్నం చేసి గెలవాలి.



ఈ యువకుడు దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గాండ్ల గణేశ్. ప్రభుత్వం ఎప్పటికైనా ఉద్యోగాల భర్తీ చేపట్టకపోతుందా...అని హైదరాబాద్‌లో సాధన చేస్తున్నారు. నిరాశకు లోనుకాకుండా తన చదువును కొనసాగిస్తూ ఎలాగైనా కొలువు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు.



తెలివితేటలు ఉన్నప్పటికీ కష్టపడే మనస్తత్వం లేకపోతే గొప్ప విజయాలు సాధించలేరు.

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య

ఒత్తిడికి గురికావద్దు..

పరీక్షలు దగ్గరపడే కొద్దీ ఒత్తిడికి గురి కావొద్దు. ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే రోజును విభజించుకొని ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. రోజును ఏ విధంగా చదువుకోవాలన్న దానిపై విభజించుకోవాలి. ఒత్తిడితో న్యూరాన్ల మధ్య సమన్వయం లోపించి ఆందోళన, ధారణశక్తి కోల్పోవటం, మతిమరుపు వంటి రుగ్మతలు ఏర్పడుతాయి. సాధ్యమైనంత వరకు మెదడుకు పని చేప్పే అభ్యాసాల సాధన చేయాలి.

నిరుపేద కుటుంబం నుంచి జిల్లా విద్యాధికారిగా..



నిరుపేద కుటుంబం నుంచి ఎన్నో కష్టాలను, సవాళ్లను అధిగమిస్తూ జిల్లా విద్యాధికారిగా ఎదిగారు...చెన్నూర్ మండల కేంద్రానికి చెందిన నాంపల్లి రాజేష్‌కుమార్. ఆయన తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి సరోజ టైలరింగ్ పని చేస్తూ చదివించింది. తల్లి కష్టాలను అర్థం చేసుకొని చాలా కష్టపడి చదువుకున్నారు. 1 నుంచి 7 వరకు స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించారు. 8 నుంచి 10 వరకు బెల్లంపల్లిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకొన్నారు. ఇంటర్ విద్యను తనకు తెలిసిన టైలరింగ్ పని చేస్తూ స్థానిక కళాశాలలో చేరారు. తల్లికి భారంగా ఉండకూడదని టైలరింగ్ చేస్తూ తన తమ్ముడి చదువుకు తోడ్పాడ్డారు. అనంతరం టీటీసీలో సీటు సాధించి శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. గ్రూప్స్ సాధించాలనే లక్ష్యంతో నిరంతర శ్రమతో పట్టుదలగా చదివి ఎంపికయ్యారు. తొలుత గిరిజన సంక్షేమ సహాయ అధికారిగా బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం నిజమాబాద్ జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

పాఠ్య పుస్తకాలే ప్రామాణికం

చాలా మంది అభ్యర్థులు ప్రైవేట్ గైడ్స్, మెటీరియల్స్ పుస్తకాలనే ఎక్కువ చదువుతున్నారు. గతంలో ఈ విధానంలో ప్రశ్నలు వచ్చిన మాట నిజమే. ఇప్పుడే ఈ పరిస్థితి మారింది. ఉన్నత పాఠశాల స్థాయి పాఠ్య పుస్తకాలపై అవగాహన పెంచుకోవాలి. విషయం అర్థం చేసుకోకుండా బట్టీలు పట్టడం వల్ల పరీక్షలో నెగ్గలేరు. వీలైనంత వరకు ఐదు నుంచి పదో తరగతి పాఠ్య పుస్తకాలు చదవడం ద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుంది.



ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను వాడాలి

జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అటవీ శాఖ జిల్లా అధికారి ప్రభాకర్ అన్నారు. మంచిర్యాలలోని అటవీ శాఖ కార్యాయలంలో బుధవారం విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రసాయనాలతో తయారు చేసిన గణపతి విగ్రహాలను వాడవద్దని ఆయన కోరారు. నేషనల్ గ్రీన్‌కోర్ శిక్షకుడు గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాలు వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తేవడానికి ఈ వర్క్‌షాప్ నిర్వహించామని తెలిపారు. జిల్లా అటవీ శాఖ, గ్రీన్‌కోర్ సంయుక్తంగా విద్యార్థులకు మట్టి గణపతుల తయారుపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ విగ్రహాలను ఆకర్షణీయంగా తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాధికారి రవికాంత్, పురపాలక కమిషనర్ చింత శ్రీకాంత్, అటవీ శాఖ రెంజ్ అధికారి అప్పయ్య, బీట్ అధికారి రేపతిరెడ్డి, గ్రీన్‌కోర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీఈఓ రవికాంత్



మట్టి గణపతి విగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థులు

భూములను పకడ్బందీగా సర్వే చేయాలి

ఇన్ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి ప్రియాంక

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలోని భూముల రికార్డులను పకడ్బందీగా సర్వే చేయాలని ఇన్ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి ప్రియాంక అన్నారు. మంచిర్యాలలోని షాధిఖానా ఫంక్షన్ హాల్‌లో బుధవారం వీఆర్వోలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలో రెవెన్యూ అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వేలో పట్టాదారుల వద్ద ఉన్న దస్త్రాలు, రెవెన్యూ రికార్డులు పరిశీలించాలన్నారు. రికార్డులో తేడాలు ఉంటే సరి చేయాలన్నారు. కాస్ర పహాణీ, 1బి, సేత్వార్ రికార్డుల ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేటు భూముల రికార్డులను సరి చేయాలన్నారు. భూములు గతంలో అమ్మకాలు చేసిన రెవెన్యూ రికార్డుల్లో మార్చుకోకపోవడం, చనిపోయినా పట్టాదారుల స్థానంలో వారి వారసుల పేర్లు మార్చుకోకుంటే వెంటనే రెవెన్యూ చట్టం ప్రకారం రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. భవిష్యత్‌లో భూఆక్రమణలను అరికట్టడానికి ఇంటింటి సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి ఆర్డీఓ శ్యామలదేవి, తహసీల్దార్ సదానందం, ఆర్.ఐ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్ఛార్జి డీఆర్వో ప్రియాంక

తెరపై ఈనాడు

ఏసీసీ, న్యూస్‌టుడే:
వేంకటేశ్వర - జయ జానకి నాయక,
ఏషియన్ శ్రీనివాస - ఫిదా, లక్ష్మి- నేనే రాజు నేనే మంత్రి,
మయూరి - నిన్నుకోరి

మంచిర్యాల

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ అధికారులు స్వచ్ఛభారత్‌పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించడానికి వీటిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, మున్సిపల్ ఇంజినీరు సాంబయ్య, సిబ్బంది చిప్పకుర్తి రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టితో మహాగణపతి


వినాయకుడిని తయారు చేస్తున్న తిరుపతి

ఏసీసీ, న్యూస్‌టుడే:

మట్టి వినాయకులనే కొలవండి.. పర్యావరణాన్ని కాపాడండి ఈ పదాలు కేవలం గణేషుడి నవరాత్రుల ఉత్సవాలకు పది రోజుల ముందు నుంచి మాత్రమే వినిపిస్తుంటాయి. నిమజ్జనం తర్వాత మళ్లీ ఏడాదికి గానీ గుర్తుకురావు. అలాంటిది ప్రకృతికి ఎటువంటి హాని కలిగించకుండా మట్టి వినాయకులను తయారుచేస్తూ ఉపాధి పొందుతున్నారు మంచిర్యాల యువకుడు తిరుపతి. నాలుగేళ్లుగా వందల సంఖ్యలో వీటిని తయారుచేస్తూ తనవంతుగా పర్యావరణాన్ని కాపాడుతున్నారు.


పలు రకాల ఆకృతిల్లో...

బెజ్జూరుకు చెందిన తిరుపతి ఉపాధి నిమిత్తం మంచిర్యాలకు వలస వచ్చారు. తన బాబాయితో కలిసి మేస్త్రీ పనులకు వెళ్తుంటారు. కాలుష్యాన్ని నివారించాలని మట్టి వినాయకులనే కొలవాలని ఈ మధ్య విపరీతంగా ప్రచారం చేస్తుండటంతో వీటికి గిరాకీ పెరిగింది. తిరుపతికి అప్పటికే వీటిపై అవగాహన ఉండటంతో తయారుచేయడం ప్రారంభించారు.

పర్యావరణహితుడు తిరుపతి

దీన్నే ఉపాధిగా మలుచుకున్నారు. ఒకనెల ముందు నుంచి తయారుచేయడం ప్రారంభించి పండగ రోజున విక్రయిస్తుంటారు. తిరుపతి చేస్తున్న మట్టి వినాయకులకు స్పందన రావడంతో ఏటా విగ్రహాల తయారీ పెరుగుతుందే తప్ప తరగడంలేదు. ఎప్పుడూ గృహావసరాల కోసం చిన్న చిన్న వినాయకులను రూపొందించిన ఆయన రెండేళ్ల నుంచి 4 నుంచి 6 అడుగుల ఎత్తుతో తయారుచేయడం ప్రారంభించారు. మండపాల నిర్వాహకులు చెప్పిన ప్రకారం విగ్రహాలు రూపొందిస్తారు. రసాయనాలులేని రంగులువేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు.


సహజ రంగులతో గణనాథుడు

మట్టితోనూ భారీ వినాయకులు తయారుచేయొచ్చు

తిరుపతి, మట్టి వినాయకుల తయారీదారుడు

మట్టితో చేసే వినాయకులు ఎక్కువగా దృఢంగా ఉండవని చాలా మంది అపోహ పడుతున్నారు. మట్టితోనూ భారీ వినాయకులను తయారుచేయవచ్చు. 10 అడుగుల వరకు రూపొందించవచ్చు. వీటి తయారీకి కాస్త ఎక్కువగా సమయం తీసుకున్నా పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదు. రెండేళ్లుగా పలు మండపాల నిర్వాహకులు 8 అడుగల వరకు వినాయకులను తయారుచేయించి తీసుకెళ్తున్నారు. వీటిని తయారుచేయాలంటే పండుగకు నెల ముందు సంప్రదించాలి. అప్పుడే దృఢంగా చేయగలం. మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా మట్టిని తీసుకొచ్చి రసాయనాలను వాడకుండా తయారుచేస్తాం.


నోటికి నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని వినూత్న నిరసన

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో మండలస్థాయిలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, అటెండర్లను ప్రభుత్వం సత్వరమే క్రమబద్ధీకరించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సెర్ప్ ఉద్యోగులు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏరియా కోఆర్డినేటర్ కార్యాలయం ముందు నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని వినూత్న రీతిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా సెర్ప్ ఉద్యోగుల సమ్మెకు జిల్లా బీసీ సంక్షేమ సంఘం, వీఓఏల సంఘం నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుమ్ముల శ్రీనివాస్, సల్మాన్, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆనంద్‌బాబు, నరేష్, అశోక్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

గురుగుల నిమజ్జనాన్ని విజయవంతం చేయాలి

ఏసీసీ, న్యూస్‌టుడే: తెలంగాణ నేతకాని మహార్ కుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో పొలాల అమావాస్య పండగను పురస్కరించుకుని మూడు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకలను గురువారం ముగిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాసిపేట మండలంలో చివరిరోజు జరిగే గురుగుల నిమజ్జనానికి అతిథులుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే సంఘం గౌరవ అధ్యక్షుడు దుర్గం చిన్నయ్య, వ్యవస్థాపకులు గోమాస శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం గోపాల్, ఆబ్కారీశాఖ ఉప కమిషనర్ బొర్లకుంట వెంకటేష్‌నేత, ముఖ్య సలహాదారుడు దుర్గం అశోక్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. నేతకాని కులస్థులు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగులపై వ్యతిరేక విధానాలు విడనాడాలి

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలను విడనాడాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నం రమేష్ డిమాండ్ చేశారు. 7వ పే కమీషన్ అమలులో జాప్యాన్ని నిరసిస్తూ డాక్ సేవక్ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంకతి మల్లయ్య, సహాయ కార్యదర్శి గుంపుల మల్లయ్య, సహాయ కార్యదర్శి బండారి రమేష్, రేమేష్ బాబు, శ్రీనివాస్, చంగల్ రావు, నారాయణ, భూమయ్య, జకరయ్య, రామన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి వీవీడీసీ సన్మానం

ఏసీసీ, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో రెండేళ్లకు పైగా సేవలందించి ఇటీవల బదిలీ అయిన సీఐ దామెర సుధాకర్‌ను బుధవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ అన్ని రకాలుగా సహకరించిన సీఐని అధ్యాపకులు శ్రీనివాస్, చంద్రమోహన్ గౌడ్‌లు కొనియాడారు. కళాశాలలో అనేక అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి విద్యార్థులను చైతన్యపరిచారని గుర్తుచేశారు. పట్టణంలో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు.


విద్యార్థులకు ప్లేట్లను అందజేస్తున్న మార్కెట్ కమిటీ అధ్యక్షుడు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

లింగాపూర్(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ, తమ ఉజ్వల భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బియ్యాల తిరుపతి అన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో బుధవారం ఎంపీపీ ఉపాధ్యక్షుడు ఆకుల రాజేందర్, పీఏసీఎస్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, గూడెం ఎంపీటీసీ సభ్యుడు ముత్తె నారాయణ, నాయకులు నెల్కి సుభాష్ తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే ప్లేట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి మాట్లాడుతూ సొంత ఖర్చులతో పళ్లాలను అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. 500 మంది విద్యార్థులకు పళ్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఇప్ప భూమయ్య, మగ్గిడి శ్రీనివాస్, పాఠశాల ఇన్చార్జీ ప్రిన్సిపల్ చైతన్య స్రవంతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉపారపు లింగయ్య, నాయకులు శివలాల్, బచ్చల అంజన్న, ముత్తె రాజన్న, ఇప్ప రవి, శ్రీనివాస్, పిట్టల అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మట్టి విగ్రహాలు

ఏసీసీ, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలోని విద్యార్థులు తయారుచేసిన మట్టి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. మట్టితో వివిధ రూపాల్లో అందంగా తీర్చిదిద్ది అబ్బురపరిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై వేడుకను తిలకించారు. ఆకులు, కూరగాయలు, బాహుబలి రూపంలో ఉన్న వినాయక విగ్రహాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వరూప, ఉపాధ్యాయులు దేవేందర్, సురేష్, రాజేష్, వనిత, రీనారాణిదాసు, సౌమ్య, రజిత, పద్మ, శారధ తదితరులు పాల్గొన్నారు.


మట్టి విగ్రహాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

దండేపల్లి: పీఓపీతో చేసిన మట్టి వినాయకులను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమవుతుందని, పర్యావరణం దెబ్బతింటుందని మట్టి వినాయకులనే పూజించాలని జైభారత్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ సలీం, పర్యావరణ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు గోళ్ల రాజమల్లు కోరారు. జైభారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దండేపల్లిలో బుధవారం మట్టి వినాయకులనే పూజించాలంటూ సంబంధిత గోడప్రతులను విడుదల చేశారు. కార్యక్రమంలో జైభారత్ ప్రధాన కార్యదర్శి సుద్దాల జ్యోతి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పడిగల శంకర్‌రావు, నాయకులు జాబు సుగుణాకర్, బొలిశెట్టి సత్యం, లింగారెడ్డి, రమేశ్, కస్తూర్బా ఎస్‌ఓ మంజుల పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మంచిర్యాల పట్టణం: మంచిర్యాల పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగంలో పని చేసే ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ అన్నారు. మంచిర్యాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ.18,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గుత్తేదారు ద్వారా వేతనాలు చెల్లించకుండా, నేరుగా మున్సిపల్ పరంగా చెల్లించాలని కోరారు. కార్మికులకు యూనిఫామ్స్, ప్రభుత్వం ఇచ్చే రెండు పడక గదుల ఇళ్లు, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

మంచిర్యాల మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఒప్పంద కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సంఘం గౌరవ అధ్యక్షుడిగా సుదమల్ల హరికృష్ణ, అధ్యక్షుడు గజెంగి మురళీ, ఉపాధ్యక్షులు ఆవునూరి గురువయ్య, పెరుక రవి, వర్మి రామకృష్ణ, కార్యదర్శులుఎండీ సలీమ్, ఎండీ సాదిక్, సంయుక్త కార్యదర్శులు సంకె దిలీప్‌కుమార్, సుదమల్ల విక్రమ్, కార్యనిర్వాహక కార్యదర్శులు ఆవునూరి రాయలింగు, ఎస్.కె.అన్వర్, కార్యదర్శులు రావుల సతీష్, చిలుముల నరేష్, ముఖ్యసలహాదారులు పెరుక ఎల్లయ్య, ఎండీ కబీర్, బండవరం రవి, బోయిని తిరుపతి, కార్యవర్గ సభ్యులు కొండ లింగయ్య, కురి మిల్ల శేఖర్, పెరుక నరేష్, జాడి శంకర్, ఎస్.కె.హైమద్, కానాజి శ్రీనివాస్, ఉస్కమల్ల సంపత్, పి.రామన్న, కుమ్మరి భీమ్‌రాజ్, కోలపురి ఎడ్వర్డు, పిట్టల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

మంచిర్యాల

ఏబీవీపీ మహిళ కన్వీనర్ల నియామకం

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: అఖిల భారతీయ విద్యార్థి సంఘం (ఏబీవీపీ) జిల్లా మహిళ విభాగం కన్వీనర్లను నియామకం చేసినట్లు ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు బాపు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపూర్‌కు చెందిన ఏనుక స్వప్న కన్వీనర్‌గా, సోమగూడెంకు చెందిన దొంతమల్ల లక్ష్మి కో-కన్వీనర్లుగా ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా మురుగునీటి కాల్వలు

రాంనగర్‌లో ఇళ్ల మధ్యలోనే మురుగునీరు

సీసీసీ(శ్రీరాంపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: నస్పూర్ మండలం తీగల్‌పహాడ్ పంచాయతీ పరిధి సీసీసీ రాంనగర్‌లోని 11వ వార్డులో మురుగునీటి కాల్వల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. సీసీసీలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు రాంనగర్‌లోకి చేరుతోంది. కాలనీలోంచి మురుగునీరు బయటకు వెళ్లేందుకు సరైన కాల్వలు లేకపోవడం వల్ల ఆ నీరంతా ఇక్కడే నిల్వ ఉంటుంది. దీనికితోడు చెత్త చెదారం అంతా కాల్వల్లోకి చేరడంతో వాటి నుంచి దుర్వాసన వస్తోంది. కాలనీలో మురుగునీటి కాల్వల నిర్మాణంలో ప్రణాళిక లోపం వల్ల మురుగునీరు ఇళ్లలోకి చేరుతోంది. మురుగునీరు రోడ్లపైకి వస్తుండటంతో గత



రాంనగర్‌లో మురుగునీటితో నిండిన కాల్వలు



రాంనగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పదేళ్లుగా కాలనీలోని ఓ రోడ్డు మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడి నీటి బావులు కాల్వలకు సమీపంలోనే ఉండటంతో మురుగునీరు ఊట ద్వారా బావుల్లోకి చేరుతోంది. దీనివల్ల బావుల్లో నీరంతా కలుషితమై వాడకానికి పనిచేయడం లేదు. ఈ కాల్వలను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయకపోవడం వల్ల చెత్త చెదారం కాల్వలోకి చేరడంతో అవి అపరిశుభ్రంగా తయారవుతున్నాయని రాంనగర్ వాసులు తెలిపారు. పదేళ్ల కిందట నిర్మించిన కాల్వలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థనీరు ఎటూ వెళ్లలేక అక్కడే నిల్వ ఉంటుందని పేర్కొన్నారు. కాలనీలో కొత్తగా మురుగునీటి కాల్వలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, పందుల వల్ల కాలనీవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కాలనీలోని కాల్వల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

త్వరలోనే కొత్త కాల్వలు నిర్మిస్తాం

అజ్మత్ అలీ, పంచాయతీ కార్యదర్శి తీగల్‌పహాడ్

రాంనగర్‌లోని మురుగునీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆ నీరంతా కాలనీల్లోనే నిల్వ ఉంటుంది. ఇదివరకు కాలనీవాసులు సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై పంచాయతీ పాలకవర్గ సభ్యులతో చర్చించి త్వరలోనే ఇక్కడ కొత్త కాల్వలు నిర్మించి మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. చెత్త లేకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో కాల్వలను శుభ్రం చేయిస్తాం.



జిల్లా విద్యాశాఖ డైరెక్టర్ అబ్దుల్‌ఘనీకి వినతిపత్రం అందజేస్తున్న రాపల్లి గ్రామస్థులు

పాఠశాలకు భవనం కేటాయించాలి

మంచిర్యాల గ్రామీణం: హాజీపూర్ మండలం రాపల్లి గ్రామ పునరావాస కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు నిర్మించిన భవనాన్ని ఆ పాఠశాల విద్యార్థులకు సత్వరమే కేటాయించాలని కోరుతూ బుధవారం గ్రామస్థులు భాజపా నాయకులతో కలిసి జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎండి.అబ్దుల్‌ఘనికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాలను నిర్మించినప్పటికీ పలువురు రాజకీయ కారణాలతో ఆ పాఠశాలను విద్యాశాఖకు అప్పగించడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షులు ఎనగందుల కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి మోటపలుకుల తిరుపతి, గ్రామస్థులు రాజనర్సు, బాపు, శ్రీనివాస్, గట్టయ్య,అబ్రహం,పాల్గొన్నారు.



సీపీఎస్ ఆందోళన గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సీపీఎస్ విధానం ఎత్తివేసే వరకు ఆందోళన

దండేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు కొత్తగా అమలు చేస్తున్న కంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని రద్దు చేసేవరకు ఆందోళన చేపడతామని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘ నాయకులు హెచ్చరించారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నా గోడప్రతులను బుధవారం ఎమ్మార్సీలో ఎంఈఓ బొలిశెట్టి రాజయ్య ఆవిష్కరించారు. పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల పదవీ విరమణ తర్వాత ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ సంఘ నాయకులు గట్ల శ్రీనివాస్, మాలావత్ బిక్షపతి నాయక్, పీఆర్టీయూ, టీయూటీఎఫ్ మండల అధ్యక్షులు అన్నం సత్యానారాయణ, కొట్టె చంద్రమౌళి, సంఘ నాయకులు ముత్తినేని రమేశ్, గోపాల్, ఆర్.రమేశ్, పున్నంచంద్, డి.రాజయ్య, వరలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు స్థానిక టీఎన్‌జీవోస్ సాయిచంద్ర ఫంక్షన్‌హాల్‌లో జిల్లా స్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జాగృతి జిల్లా కన్వీనర్ లింగంపల్లి ప్రేంరావు తెలిపారు. తెలంగాణం (ఊరు, బాల్యం, జీవన విధానం, కళలు, వృత్తులు, భాష) అంశాలపై జరుగు సమ్మేళనంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు చేసుకోని వారు నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం స్థానిక జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కో కన్వీనర్ మద్దెల లక్ష్మణ్, మహిళ కన్వీనర్ కనుకుంట్ల తిరుమల, యువజన విభాగం కన్వీనర్ హరీశ్‌గౌడ్, బోనగిరి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

సీసీసీ(శ్రీరాంపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: నస్పూర్ పంచాయతీ పరిధిలోని 8వ వార్డు లక్ష్మినగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీకి చెందిన మహిళలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కాలనీలకు గోదావరి తాగునీటిని అందించేందుకు ఇక్కడ ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారన్నారు. ఈ ట్యాంకు ద్వారా లక్ష్మినగర్, ప్రశాంత్‌నగర్, సుభాష్‌నగర్, గాంధీనగర్ ఏరియాలకు గోదావరి తాగునీటిని సరఫరా చేశారని చెప్పారు. ప్రస్తుతం ఈ ట్యాంకు నుంచి కాలనీలకు తాగునీటిని సరఫరా చేయడం లేదని, దీంతో తాము తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని చెప్పారు. గోదావరి తాగునీటిని సరఫరా చేయాలని ఇదివరకు పలుమార్లు పంచాయతీ ఈఓ, సర్పంచి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలకు తాగునీటిని సరఫరా చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోండ్ర లింగయ్య, బూర రవీందర్, ప్రేంసాగర్, బుద్దె రాజయ్య, రౌతు శ్రీనివాస్, రౌతు రజిత, ఇతర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మి నగర్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

దండేపల్లి, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం దండేపల్లి తపాల కార్యాలయం ముందు గ్రామీణ తపాల ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. విధులు బహిష్కరించి కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగుల సంఘ నాయకులు మాట్లాడుతూ తమకు వేతనాల్లో సవరణ చేయాల్సిన ఏడో వేతన కమిషన్ రెండేళ్ల కిందట నుంచే అమలు చేయాల్సి ఉండగా ఇంతవరకు అమలు చేయడం లేదని దీనివల్ల వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామీణ ఉద్యోగులను పట్టించుకోవడం లేదని జీడీఎస్ వేతన కమిటీ సిఫారసులు అమలు చేయాలని, ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం పింఛను అందజేయాలని, 8 గంటలు మాత్రమే పని చేయించుకోవాలని, బలవంతపు లక్ష్యం (టార్గెట్) నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ పోస్ట్ మాస్టర్ బుక్యా సదర్‌లాల్, గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘ నాయకులు లక్కం కిరణ్‌కుమార్, ఎస్‌కె దావూద్, అప్జల్, జైనొద్దీన్, విక్రం, మోహన్, శైలజ, కల్పన తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

హరితహారంపై కళాజాత

తాళ్లపేట(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: దండేపల్లి మండలం తాళ్లపేట ఉన్నత పాఠశాలలో బుధవారం హరితహారంపై కళాజాత నిర్వహించారు. మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించాలని కళాకారులు తమ ఆటపాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, కళాకారులు ముల్కల్ల మురళి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

హాజీపూర్ (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని హాజీపూర్, ముల్కల్ల గ్రామాల్లో బుధవారం గ్రామసభలను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాల యువతీ, యువకుల సంక్షేమం కోసం రాయితీలను అందిస్తున్నందున గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఈ దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలను గ్రామస్థుల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మండలపరిషత్తు ఉపాధ్యక్షుడు మందపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, హాజీపూర్ సర్పంచి ఆకుతోట సత్తమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, ముల్కల్ల సర్పంచి నాయికిని శంకరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మంగ, హాజీపూర్ ఉపసర్పంచి సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి సమ్మిరెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌లు సూర్యారావు, వినోద్‌కుమార్, రమేష్‌రెడ్డి, కారోబార్‌లు ప్రభాకర్, సత్యనారాయణ, వార్డుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భూఆక్రమణల ఆరోపణలన్నీ అవాస్తవాలు

★ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: మంచిర్యాలలో భూ ఆక్రమణలు చేశారంటూ తన తండ్రి లక్ష్మణ్ రావుపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలని మంచిర్యాల శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 324 లోని 57.04 ఎకరాల భూమిని తన తండ్రి లక్ష్మణ్ రావు పేరుపై ఆన్‌లైన్‌లో కొందరు రెవెన్యూ అధికారులే మార్చారని ఆయన విమర్శించారు. భూ ఆక్రమణలపై జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్ విచారణ కోసం మంచిర్యాల ఇన్ఛార్జి ఆర్డీఓ శ్యామలాదేవిని నియమించగా ఆమె ఈ ఆరోపణలన్నీ నిరాధారమైన ఆరోపణలని రిపోర్టు ఇచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని 324 సర్వే నెంబరులో 117.04 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా ఇందులో 70.29 ఎకరాల భూములను 2012లో మంచిర్యాల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన దత్తాత్రి ఆన్‌లైన్‌లో అదనంగా చేర్పించినట్లు ఆయన తెలిపారు. ఇందులో తన తండ్రి పేరుపై 57.04 ఎకరాల భూమిని తప్పుగా నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంఘటకు బాధ్యులైన వారిపై జిల్లా కలెక్టర్ ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సేవచేసేందుకు ఎమ్మెల్యేగా గెలిచిన తనపై కాంగ్రెస్ నాయకులు కుట్రపూరితమైన ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన నాటి తహసీల్దార్ దత్తాత్రి చేత ఆన్‌లైన్‌లో మార్పులు చేయించి కుట్ర పన్ని తనపై భూముల ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లో ఉంటున్నానని భూములు కబ్జా చేసేందుకు కాదని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న తెరాస పట్టణ అధ్యక్షులు గాదె సత్యం మాట్లాడుతూ భూముల ఆన్‌లైన్ రికార్డుల్లో తప్పుడు పేర్లు నమోదుచేసిన వారిని కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో తెరాస ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, తెరాస నాయకులు పెంట రాజయ్య, యాదగిరి రావు, తోట తిరుపతి, వంగ తిరుపతి, గొంగళ్ల శంకర్, నల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, తదితరులు

భూకబ్జాపై విచారణ

సీసీసీ(శ్రీరాంపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: నస్పూర్ మండలం సీసీసీలోని వారసంతకు చెందిన భూమి వివాదంపై తహసీల్దార్ కుమారస్వామి బుధవారం విచారణ చేపట్టారు. నస్పూర్ పంచాయతీ పరిధిలోని వారసంతకు చెందిన భూమి కబ్జాకు గురైందని బుధవారం 'ఈనాడు' మినీలో 'నెంబరు ఒక్కటి.. భూమి మరొక్కటి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన సీసీసీ ఎస్సై దత్తాత్రితో కలిసి వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. కోర్టు ఆర్డరు ప్రకారం వివాదాస్పద స్థలం వారసంత కోసం కేటాయించిందని, ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఈ స్థలానికి సంబంధించిన హక్కుదారులు ఎవరైనా ఉంటే కోర్టు ద్వారా నిరూపించుకోవాలని సూచించారు. కోర్టు నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వివాదాస్పద స్థలంలో నిర్మాణాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ సర్పంచి వేల్పుల రాజేష్, ఈఓ శ్రీపతి బాపు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్‌లోని వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కుమారస్వామి, ఎస్సై దత్తాత్రి



రెడ్‌క్రాస్ సొసైటీ అనాథ్రశమం చిన్నారులకు వస్తువులు అందచేస్తున్న డీసీపీ, ఏసీపీలు

అనాథలకు అండగా నిలవాలి

■ డీసీపీ జాన్‌వెస్లీ

మంచిర్యాలనేరవిభాగం: సమాజానికి దోహదపడేలా పోలీసులు-జర్నలిస్టులు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకొని అనాథలకు అండగా నిలవడం అభినందనీయమని మంచిర్యాల డీసీపీ జాన్‌వెస్లీ పేర్కొన్నారు. గత గణతంత్ర దినోత్సవంలో భాగంగా పోలీసులు, జర్నలిస్టుల మధ్య జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ద్వారా సేకరణ జరిగిన రూ.2 లక్షల విరాళాలతో స్థానికంగా స్వచ్ఛంద సంస్థల ద్వారా నడుస్తున్న అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీపీ మాట్లాడుతూ పోలీసులు పునర్జన్మ, జనమైత్రి వంటి కార్యక్రమాలతో ప్రజలతో మమేకం అవుతున్నారన్నారు. రెండు సంవత్సరాలు వరుసగా నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ద్వారా అభాగ్యులకు ఎంతో మేలు కలిగిందని, ఇది కొనసాగింపు కావాలని ఆయన ఆకాక్షించారు. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారులు ఏఎస్పీ విజయ్‌కుమార్, సీఐ సుధాకర్, ఎస్సై లతీఫ్, అశోక్‌లతో పాటు జర్నలిస్ట్ సోదరులు, దాతలు చేసిన కృషి ఆదర్శవంతమైందన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ చెన్నయ్య, సీఐలు ప్రమోద్‌రావు, అనిల్‌కుమార్, ఎస్సైలు అశోక్, బుద్దె స్వామి, జర్నలిస్టుల సంఘం నాయకులు ఉమేష్, ప్రభాకర్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు చందూరి మహేందర్, అశోక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో పదేళ్ల జైలు

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన రంగు శ్యామల అనే మహిళకు పదేళ్ల జైలు శిక్షను ఆసిఫాబాద్ న్యాయస్థానం ఖరారు చేసిందని తాళ్లగురిజాల ఏఎస్సై అన్నవేని మల్లేశం తెలిపారు. వివరాల ప్రకారం 2010లో రంగు ఉమా అనే వివాహిత వరకట్న వేధింపులతో ఆత్మహత్య చేసుకుందన్నారు. తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో సమోదైన ఫిర్యాదుతో విచారణ చేసిన పోలీసులు ఆత్మహత చేసుకోవడానికి అత్త రంగు శ్యామల వేధింపులే కారణమని తేల్చి మంగళవారం న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఏఎస్సై వివరించారు.



మట్టి వినాయకులతో ర్యాలీ నిర్వహిస్తున్న దండేపల్లి కస్తూర్బా బాలికలు

మట్టి వినాయకులనే పూజించాలి

దండేపల్లి, న్యూస్‌టుడే: మట్టి వినాయకులను పూజిస్తేనే పర్యావరణానికి రక్ష అని దండేపల్లి మండల విద్యాధికారి బొలిశెట్టి రాజయ్య, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు రంగప్ప అన్నారు. మట్టి వినాయకులనే పూజించాలంటూ ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు బుధవారం దండేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు, కస్తూర్బా విద్యాలయం బాలికలు దండేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కస్తూర్బా బాలికలు మట్టి వినాయకులను తయారు చేసి వీటిని ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. తాము తయారు చేసిన మట్టి వినాయకులను గ్రామంలో మహిళలకు అందజేసి వీటిని ఇళ్లలో ఉంచి పూజించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయం ఎస్ఓ మంజుల, ఉపాధ్యాయులు, సీఆర్టీలు పాల్గొన్నారు.

ముందస్తు... ముస్తాబు

★ భారీ గణనాథులకు వేదికలు సిద్ధం

ఏసీసీ, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొలువదీరే భారీ గణనాథులకు ముందస్తుగా వేదికలను భారీ బందోబస్తుతో ఏర్పాటు చేస్తున్నారు. ఏటా పలు కాలనీల్లో కొలువయ్యే భారీ వినాయకుల విగ్రహాల మండపాలను పకడ్బందీగా సిద్ధం చేస్తున్నారు. స్థానిక లేబర్‌కాలనీలో ఈ ఏడాది నుంచి దీర్ఘకాలికంగా ఉండే విధంగా వేదికను నిర్మిస్తున్నారు. తితిదే కళ్యాణమండపం సమీపంలోని మండపాన్ని 15 అడుగులకు పైగా ఎత్తు ఉండే విధంగా కసరత్తు చేస్తున్నారు, చింతపండువాడలోని మండపం ఆకాశాన్నంటుతుందా అనే రకంగా వేదికను సిద్ధం చేస్తుండగా పురపాలక కార్యాలయరోడ్‌లో వాహానాన్నే గణేశుడి మండపంగా తీర్చిదిద్దుతున్నారు. రెడ్డికాలనీలో రహదారినే గణేశుని వేదికగా మలుచుకున్నారు. ప్రతి కాలనీల్లో పోటాపోటీగా గణనాథులను కొలువుదీర్చేందుకు ఆయా మండపాల నిర్వాహకులు తహతహలాడుతున్నారు.



తితిదే కల్యాణమండపం సమీపంలో సిద్ధమవుతున్న భారీ వేదిక



రహదారినే వేదికగా మలచిన రెడ్డికాలనీ గణేశ్ మండలి నిర్వాహకులు

గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలి

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ సార్వత్రిక అర్హత పరీక్ష పూర్తయినప్పటికీ గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాలు బోధించేలా సాక్షరభారత్ సమన్వయకర్తలు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డా.రవి కాంత్‌రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా వయోజన విద్యాశాఖ కార్యాలయంలో సాక్షరభారత్ డీఆర్పీలు, మండలస్థాయి సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చదువురాని తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పించేందుకు వారి పిల్లలతో నిరంతరంగా చదువు చెప్పేలా వీసీఓలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. సాక్షరభారత్ కేంద్రాలకు మంజూరైన సామగ్రికి చెందిన రిపోర్టులను వెంటనే అందజేయాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగి ఫైజల్ బదిలీపై నిర్మల్ జిల్లాకు వెళ్తున్నందున ఆయనను జిల్లా విద్యాశాఖాధికారి డా. రవికాంత్‌రావు సన్మానించారు. సాక్షరభారత్ జిల్లా ఇన్ఛార్జి పురుషోత్తం నాయక్, డీఆర్పీలు, ఎంసీఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న వికలాంగులకు సదరం వైద్య శిబిరం రద్దు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 25న నిర్వహించే వికలాంగుల సదరం వైద్య శిబిరం వినాయక చవితి పండగ సందర్భంగా రద్దు చేస్తున్నట్టు ఆసుపత్రి నిర్వహణాధికారి డాక్టర్ యశ్వంతరావు తెలిపారు. సదరం శిబిరం నిర్వహించే తేదీని తర్వాత మళ్లీ ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని వికలాంగులు గమనించాలని ఆయన కోరారు.

(మొదటిపేజీ తరువాయి) ఆరోపణలున్నాయి. ఇప్పటికే ఓ ఏసీపీ, మరో సీఐల భూ వివాదాలపైనే ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు వెళ్లడంతో వేటు పడింది. మరి కొంద రిపైన కూడా నిఘావర్గాలు విచారణ సాగిస్తున్నాయి.

అక్రమార్కులే ఆదాయ మార్గాలు..

కాసులు కురిపిస్తున్న బొగ్గు..

మంచిర్యాల జిల్లాలో బొగ్గు వ్యాపారం పోలీసులకు కాసులు కురిపిస్తోంది. ఇక్కడ రెండు రకాలైన బొగ్గు దందా నడుస్తోంది. సింగరేణి అధికారులను మచ్చిక చేసుకుని అక్రమంగా బొగ్గుతెచ్చి శ్రీరాంపూర్, గోదావరిఖని ప్రాంతాల్లో నిల్వ చేసుకుంటారు. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు విక్రయించడం ఎప్పటి నుంచో జరుగుతుంది. ఇదంతా వ్యాపారులు సాగించే జీరో దందానే. ఈ అక్రమ వ్యాపారం నడిపించే వ్యాపారుల ఆయా ప్రాంతాల్లో ఉన్న పోలీసు స్టేషన్లకు నెలవారీ మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే. మరోరకమైన దందా కూడా నడుస్తుంది. అధికలోడుతో వచ్చే బొగ్గు, కంకర వంటి వాహనాలను ఆపకుండా ఉండటానికి కూడా పోలీసులకు డబ్బులివ్వాల్సి వస్తుంది. కేసులు రాయడం ద్వారా వచ్చే డబ్బులు అదనమే. ఇటీవల బొగ్గువాహనాలను ఆపేసి కేసులు పెడతామని ఓ ఉన్నతాధికారి బెదిరింపులతో రూ.20లక్షలు ఇచ్చినట్లుగా ప్రచారం సాగింది. అక్రమ వసూళ్లు మంచిర్యాల, శ్రీరాంపూర్, నస్పూర్ పోలీసు స్టేషన్లకు నెలవారీగా మామూళ్లు భారీగా ఉన్నట్లు సమాచారం.

ఇసుక వ్యాపారుల నుంచి..

ఇసుక వ్యాపారుల నుంచి కూడా భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ జిల్లా ఎక్కువభాగం గోదావరి తీరాన ఉండటంతో ఇసుక వ్యాపారానికి అనువైన ప్రాంతంగా పేరొందింది. వాగులు వంకలు కూడా ఎక్కువగా ఉండటం వల్ల ఆయా ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక వ్యాపారాన్ని సాగిస్తున్నారు. అధికారిక అనుమతులుంటే కాంట్రాక్టర్ల నుంచి.. అక్రమంగా తరలిస్తే వాహానానికి ఇంత చొప్పున పోలీసుస్టేషన్లకు మామూళ్లు నిర్ణయించారు. మంచిర్యాల పట్టణంతో పాటు నస్పూర్, హాజీపూర్, జైపూర్, చెన్నూర్, కోటపల్లి, లక్సెట్టిపేట, దండేపల్లి, బెల్లంపల్లి, ప్రాణహిత నదికి ఆనుకుని ఉన్న వేమనపల్లి ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పోలీసు స్టేషన్లకు ఆనుకుని అక్రమ ఇసుక నిల్వలున్నా ప్రశ్నించేవారే లేకపోయారు.

దొంగ బంగారం పేరుతో..

సింగరేణి ఉద్యోగులు అధికంగా ఉన్న మంచిర్యాల, బెల్లంపల్లి పట్టణాల్లో బంగారం వ్యాపారం జోరుగానే సాగుతుంది.

బంగారాన్ని విక్రయించే బడా వ్యాపారులను కొందరు పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. డబ్బులు ఇవ్వని వాళ్లపైన దొంగబంగారం కొనుగోలు చేసినట్లుగా కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. దొరికిన దొంగలకు కౌన్సిలింగ్ ఇచ్చి పలాన దుకాణంలో దొంగ బంగారాన్ని అమ్మినట్లుగా చెప్పమని పోలీసులే చెప్పి ఆయా దుకాణదారుల వద్దకు తీసుకెళ్లి భయపెట్టడం పరిపాటిగా మారింది. ఇటీవల హైదారాబాద్‌లో దొరికిన ఒక దొంగ మంచిర్యాల బంగారపు దుకాణంలో అమ్మినట్లుగా చెప్పించి ఆ వ్యాపారి నుంచి రూ.2లక్షలు తీసుకున్నట్లుగా సమాచారం. పోలీసుల హడావుడికి కొందరు వ్యాపారులు నెలవారీగా మామూళ్లు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది.

పాత ఇనుమేగా అనుకుంటే..

బొగ్గుబావులు, పవర్‌ప్లాంటు ఉండటంతో మంచిర్యాల కేంద్రంగా పాత ఇనుము వ్యాపారం రూ.కోట్లల్లో నడుస్తుంది. బొగ్గుబావులు, జైపూర్‌లోని సింగరేణి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో రోజువారీగా పాడైపోయిన పాత ఇనుమును దొంగతనంగా మంచిర్యాలకు చెందిన దుకాణదారులకు విక్రయిస్తారు. పాత మంచిర్యాల ప్రాంతంలో పెద్ద పెద్ద నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని వాటిలో పాత ఇనుము నిల్వ చేసుకొని అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. ఈ అక్రమ వ్యాపారం వెనుక భారీగానే చేతులు మారుతున్నాయి. పోలీసులు మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణానికి చెందిన ఓ చోటా నేత ఈ విషయంలో చక్రం తిప్పుతున్నారు. పాత ఇనుము కాకుండా రాగి, ఇత్తడి వంటి వాటిని కూడా కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నా పోలీసులు ప్రేక్షకుల్లానే వ్యవహరిస్తున్నారు. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, శ్రీరాంపూర్ పోలీసు స్టేషన్ల పరిధిలో నెలవారీ మామూళ్లిచ్చి తమ అక్రమ వ్యాపారానికి అడ్డులేకుండా చేసుకుంటున్నారు. జైపూర్ మండలంలోని సింగరేణి పవర్‌ప్లాంటు నుంచి భారీగా పాత ఇనుము దొంగతనంగా తెచ్చి మంచిర్యాలలో అమ్మేశారు. ఈ కేసులో పెద్దలు బయటకు రాకుండా డబ్బులు తీసుకుని కేవలం అక్కడి వాచ్‌మెన్‌పైనే కేసు నమోదు చేసి మమా అనిపించడం పోలీసుల తీరుకు అద్దం పడుతుంది.

నకిలీ విత్తనాలు..

నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డాగా మారిన మంచిర్యాల జిల్లాలో పోలీసుల వ్యవహారశైలి కూడా అనుమానాలు కలిగిస్తోంది. వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుని వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లుగా ప్రచారంలో ఉంది. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంచిర్యాల జిల్లాలోనే నకిలీ పత్తి విత్తనాల విక్రయాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. పరోక్షంగా పోలీసుల సహకారం ఉండటం వల్లే భారీగా నకిలీ పత్తి విత్తనాలను విక్రయించినట్లు తెలిసింది. ఈ విషయంలో ఓ పోలీసు అధికారి రూ.30లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదు ఉన్నతాధికారులకు చేరడంతో ఆయనపైన వేటు వేసినట్లు కూడా ప్రచారంలో ఉంది.

డబ్బులిచ్చిపోస్టింగ్‌లు తెప్పించుకుని..

మంచిర్యాల ప్రాంతంలో పోలీసులకు భారీ ఆదాయ వనరులు ఉండటంతో ఇక్కడ పనిచేయడానికి పోటీపడతారు. జిల్లాల విభజన కంటే ముందు నుంచే ఈ విధమైన పరిస్థితులుండేవి. పోలీసు స్టేషన్లను బట్టి ధర నిర్ణయించడం ఆనవాయితీ. పోస్టింగ్‌ల కోసం ప్రజాప్రతినిధుల లేఖలు తప్పనిసరి చేయడంతో వాళ్లకు మామూళ్లిచ్చి రావాల్సి వస్తుంది. మంచిర్యాలలో సీఐగా పనిచేయాలంటే కనీసం రూ.15లక్షలు ముట్టజెప్పాల్సిందే. మిగిలిన ప్రాంతాల్లో రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు ధర పలుకుతుంది. అదే ఎస్.ఐలకు అయితే.. స్టేషన్ను బట్టి రూ.4లక్షలు నుంచి రూ.8లక్షల వరకు నేతలకు డబ్బులు ఇచ్చుకోవాల్సి వస్తుంది. ఇలా నేతలకు డబ్బులు ఇచ్చి పోస్టింగ్‌లు తెచ్చుకున్న అధికారులు వాటిని పూడ్చుకోవడానికే అక్రమాలకు ఒడిగడుతున్నారు. ముందే డబ్బులు తీసుకోవడంతో అక్రమాలను ప్రశ్నించే పరిస్థితి ప్రజాప్రతినిధులకు లేకుండాపోయింది.

కట్టడి చేయలేక వార్తలు రాయవద్దంటూ హితవు..

పోలీసులపైన ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన వరుస కథనాలకు ఓ ఉన్నతాధికారి స్పందన హాస్యాస్పదంగా ఉంది. "మీరు పేపర్లో ఇలా వార్తలు రాసుకుంటూ పోతే ఎలా.? మేము ఉద్యోగాలు చేయాలా..? వద్దా..? మా పరువు అంతా తీసేశారు. కొద్దిగా చూసీ చూడనట్లుగా ఉండాలి''. ఈ వ్యాఖ్యలను బట్టి చూస్తే అక్రమార్కుల్లో వణుకు పుట్టించాల్సింది పోయి.. వాటిని బయటపెట్టొద్దని చెప్పడం ఆ అధికారి పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

గిరి బడులు.. 'స్వచ్ఛత'కు దూరం!

(మొదటిపేజీ తరువాయి) ఈ విద్యా సంవత్సరం 753 మంది చదువుకుంటున్నారు. ఇందులో 40 పాఠశాలల్లో 10 మంది, 14 పాఠశాలల్లో 20 మంది కంటే ఎక్కువగా విద్యార్థులు ఉన్నారు. అయినా ఏ పాఠశాలలోనూ పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో శుభ్రత లోపిస్తోంది. స్వచ్ఛభారత్ కింద ప్రభుత్వం పాఠశాలల్లో వివిధ మౌలిక వసతులు కల్పించడమే కాకుండా ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఇన్ని చేస్తున్న ప్రభుత్వం వీటిని మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను నియిమించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తేనే శుభ్రత

జడ్పీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో అన్ని మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్య కార్మికులను నియమించడంతో అవి స్వచ్ఛత వైపు అడుగులేస్తున్నాయి. మొక్కలకు నీళ్లు పోయడం దగ్గర నుంచి గదులు శుభ్రం చేయడం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర పనులు చేయడం వల్ల పాఠశాలల్లో శుభ్రత నెలకొంది. వీటిలోనూ కార్మికులను నియమిస్తే శుభ్రత ఉండే అవకాశం ఉంది.

ఇబ్బందులు తప్పడం లేదు



ఏ.రఘునాథం, ప్రధానోపాధ్యాయుడు, కుంటల్ గూడ గిరిజన పాఠశాల

గిరిజన పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడం వల్ల పిల్లలు, మేము కలిసి పనులు చేసుకుంటున్నాం. మరుగుదొడ్ల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. మొక్కలు సంరక్షించేవారు లేక ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి కార్మికుల నియామకం చేపట్టాలి.

కార్మికులను నియమించాలి



-బుక్యా రూప్లానాయక్, ప్రధానోపాధ్యాయుడు, కుందేళ్లపహాడ్ గిరిజన పాఠశాల

ప్రభుత్వం గిరిజన పాఠశాలల పట్ల చిన్నచూపు చూస్తోంది. గత విద్యాసంవత్సరం నుంచి మండల, జడ్పీ పాఠశాలల్లో కార్మికులు పనిచేస్తుండగా ఇప్పటివరకు మా బడుల్లో నియమించలేదు. మండల పరిషత్ పాఠశాలల్లో మాత్రం నియమించి మమ్ముల్ని పట్టించుకోవడం లేదు.

ప్రతిపాదనలు పంపుతాం

- ఎం.గంగారాం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో కూడిన వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. జిల్లాలోని గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో కార్మికుల నియామకం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. త్వరలోనే ప్రతిపాదనలు పంపిస్తాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

పొత్తుల ఎత్తులు!

(మొదటిపేజీ తరువాయి) సంఘాలు ఉన్నాయి. తెబొగకాసంను ఎలాగైనా ఓడించాలనే ఏకైక లక్ష్యంతో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కలిసి పోటీ చేయాలని ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి గతంలో ఈ విషయాన్ని కార్యకర్తలకు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఏఐటీయూసీ జాతీయ నాయకత్వం కూడా 2007 ఎన్నికల్లోనే ఈ ప్రతిపాదన చేసింది. జాతీయస్థాయి నేతల మధ్య ఏకాభిప్రాయం ఉన్నా, సింగరేణి స్థాయిలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలు బలంగా ఉండి పరస్పరం బద్ధ శత్రువులుగా పనిచేయడంతో స్థానిక నేతలు పొత్తులను వ్యతిరేకించారు. జాతీయనేతలు ఈసారి పొత్తులు ఖాయమనే సందేశాన్ని ఇవ్వడంతో ఈసారి భేషజాలను పక్కనపెట్టి ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కలిసి పోటీ చేయడానికి మానసికంగా సంసిద్ధమయ్యాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు తీసుకునే తుది నిర్ణయం కోసం ఈ రెండు సంఘాలు ఎదురు చూస్తున్నాయి.

మూడు జాతీయ సంఘాల్లో పొత్తుకు విముఖత

సింగరేణిలో తెబొగకాసంను ఓడించడానికి ఐదు జాతీయ కార్మిక సంఘాలు కలిసి పోటీ చేస్తాయనే ప్రచారం జరిగింది. ఆచరణలో పొత్తు సాధ్యం కాదని మిగతా జాతీయ కార్మిక సంఘాలు భావిస్తున్నాయి. జాతీయస్థాయిలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీల మధ్య ఏకాభిప్రాయం వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా అవి రెండూ కలిసి పోటీ చేసే అవకాశం ఉందని, ఇతర సంఘాల గుర్తులపై పోటీ చేయడం వల్ల అస్థిత్వాన్ని కోల్పోవాల్సి వస్తుందని అభిప్రాయపడుతున్నాయి. హెచ్చెమ్మెస్ మొదటి నుంచి ఒంటరి పోరుకే సిద్ధమైంది. సీఐటీయూ పొత్తుకు విముఖంగా ఉంది. బీఎంఎస్ కూడా పొత్తు వల్ల ఉపయోగం లేదనే అభిప్రాయంతో ఉంది. ప్రవర్తనా నియమావళి (కోడ్ ఆఫ్ డిసిప్లేన్)లో మార్పు చేసి రెండు బ్యాలెట్ల విధానం అమలు చేస్తే పొత్తుల వల్ల నష్టం ఉండదని బీఎంఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఏరియా స్థాయిలో ప్రాతినిధ్య హోదా కోసం ఒక బ్యాలెట్, కార్పొరేటు స్థాయిలో గుర్తింపు హోదా కోసం మరో బ్యాలెట్ ఉంటే పొత్తులకు అవకాశం ఉండేది. ఏరియా స్థాయిలో ఎన్ని సంఘాల మధ్య పోటీ ఉన్నా, కార్పొరేటు స్థాయిలో ఒకే సంఘానికి మద్దతునిచ్చే అవకాశం ఉండేది. పొత్తుల్లో భాగంగా ఆయా సంఘాలకు ఉన్న బలం ఆధారంగా ఒక ఏరియాలో ఒక సంఘం, ఇంకో ఏరియాలో మరో సంఘం పోటీ చేసినా, కార్పొరేటు స్థాయిలో మాత్రం ఒకే సంఘానికి మద్దతునిచ్చే వెసులుబాటు లభించేది. అప్పుడు సంఘాల ఉనికికి భంగం కలిగి ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రచారాస్త్రాలకు పదును

ఎన్నికల తేదీ ఖరారు కావడంతో ఎన్నికల ప్రణాళికను రూపొందించుకోవడం, విపక్ష సంఘాల వైఫల్యాలు, బలహీనతలను ప్రచారాస్త్రాలుగా రూపొందించుకునే పనిలో కార్మిక సంఘాలు నిమగ్నమయ్యాయి. ఏరియాల వారీగా పేరుకుపోయిన సమస్యలపై దృష్టి సారించి వాటిని తాము ఎన్నికల్లో పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడం, సింగరేణి స్థాయిలో సమస్యల్ని ఎన్నికల ప్రణాళికలో పేర్కొని కార్మికుల్ని ఆకట్టుకునే పనిలో నాయకులున్నారు. కార్మిక సంఘాలకు ఉన్న వనరులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ప్రచారానికి ఏయే నాయకుల్ని, ఎక్కడెక్కడ వాడుకోవాలి, హోదాలు, వృత్తుల వారీగా ఓటర్లను సమీకరించడం ఎలా అనే కోణంలో సింగరేణి కార్మిక సంఘాల అగ్రనేతలు నిమగ్నమయ్యారు. గతంలో తమకు కేటాయించిన గుర్తులనే ఈసారి కూడా ఇవ్వనుండటంతో గోడలపై రాతలకు సిద్ధమయ్యారు. గోడప్రతులు, కరపత్రాలను తయారు చేసి పంపిణీ చేయడం ద్వారా కార్మికుల్లో ప్రచారం చేయడంతోపాటు, కీలకమైన ద్వార సమావేశాల్లో ఆకట్టుకునే ప్రసంగాలు ఇచ్చే నాయకులను ఏ విధంగా వాడుకోవాలనే కోణంలో సంఘాలు వ్యూహ రచన చేస్తున్నాయి. ద్వార సమావేశాలకు ముందుగానే గనులపై వేదికలకు అనుమతులు పొందడం, బహిరంగ సభలు, రోడ్‌షోల నిర్వహణతోపాటు, రాష్ట్ర, జాతీయస్థాయి కార్మిక నేతల్ని ప్రచారంలోకి దింపడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఈ ఒక్కసారి కష్టపడితే మరో నాలుగేళ్లపాటు ఇబ్బంది లేకుండా ఉంటుందని కార్యకర్తలకు నాయకులు ఉద్బోధిస్తూ ప్రోత్సహిస్తున్నారు.



బడి రాతను మార్చారు

జైనూరు, న్యూస్‌టుడే

'భూమికి పచ్చని రంగేసినట్లు' అని ఓ సినీకవి గేయాన్ని రాశాడు. అది అక్షరాల నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం పేరుతో మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టింది. పచ్చదనం, పరిశుభ్రత పాఠ్యాంశంగా భావించి బోధించడంతోనే సరిపెడితే అంతటితో లక్ష్యం నెరవేరదని భావించిన మండలంలోని రాశిమెట్ట, శేఖుగూడ ప్రభుత్వ బడుల ప్రధానోపాధ్యాయులు.. వాటి అవసరాన్ని విద్యార్థులు అనుభవపూర్వకంగా తెలుసుకునేందుకు వీలుగా బడి ఆవరణలోనే ఆచరించి చూపి ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తున్నారు. సామాజిక బాధ్యతను గుర్తు చేస్తున్నారు. కుమురం భీం జిల్లాలోని గిరిజన పాఠశాలల గురించి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

- పచ్చని ఒడిలో.. సర్కారు బడులు
- ఆకుపచ్చ తోరణం.. చూడచక్కని వాతావరణం
- హరితపాఠాలు.. వనాల పెంపులో ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు

నాడు అధ్వానం.. నేడు ఆదర్శం

జైనూరు మండలం మారుమూల గిరిజన గ్రామంలోని రాశిమెట్ట గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఒకప్పుడు సమస్యల లోగిళ్లకు నిలయం. మూడేళ్ల కాలంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.పార్వతి మదిలో తట్టిన ఆలోచనకు ఉపాధ్యాయులంతా ముందుకు రావడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. నాలుగేళ్ల క్రితం 300 మంది పిల్లల సంఖ్య దాటని పాఠశాలలో నేడు 550 మంది చదువుకుంటున్నారు.



రాశిమెట్ట ఆశ్రమోన్నత పాఠశాల



పాఠశాలలో అందమైన పూల మొక్కలు

పాఠశాలలో అడుగడుగునా మొక్కలే...

మండలంలోని రాశిమెట్ట ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో అడుగుపెడితే చాలు నందనవనాన్ని తలపిస్తోంది. లోపలి వరకు చక్కని దారి, ఇరువైపుల అందంగా విరబూసిన పువ్వులు, పచ్చని మొక్కలే దర్శనమిస్తుంటాయి. ఆవరణలో గుండ్రంగా అందమైన ఆకారంలో చామంతి, బంతి, గులాబి తదితర రకరకాల పూల మొక్కలను నాటి సంరక్షిస్తుండగా.. మరోవైపు ఖాళీ ప్రదేశంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. పాఠశాలలోని రక్షిత మంచి నీటి ట్యాంకు నుంచి వృథాగా పోయే నీటిని పైపుల ద్వారా కూరగాయల తోటకు మళ్లించి ఎంచక్కా కల్తీ లేని కూరగాయలు సాగు చేస్తూ పిల్లలకు రుచికరమైన కూరగాయల భోజనం వడ్డించేందుకు చర్యలు చేపట్టారు.. ఎత్తు పల్లాలు, గుంతలు, బండరాళ్లతో నిండిన పాఠశాల ఆవరణ చదును చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. తన మదిలో తట్టిన ఆలోచనకు అనుగుణంగా పాఠశాల పక్కనే రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండటంతో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేశారు. సదరు గుత్తేదారు, అర్‌అండ్‌బీ అధికారులను ఒప్పించి తవ్విన మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా పాఠశాల ఆవరణలోని గుంతలమయమైన మైదానంలో పోయించారు. ఒకటి రెండు కాదు.. ఏకంగా 90 టిప్పర్ల మొరం మట్టిని వేయించి చదును చేయించడంలో సఫలీకృతులయ్యారు. పెద్ద పెద్ద బండరాళ్లను జేసీబీ సహాయంతో తొలగించారు. ఫలితంగా రెండేళ్ల వ్యవధిలో చేసిన కష్టానికి సత్ఫలితాలు చూస్తున్నారు. పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేయడంతో పాటు ప్రహరీ చుట్టూ మొక్కలు పెంచుతున్నారు.



సమష్టి కృషితోనే సాధ్యం

- ఎ.పార్వతి, ప్రధానోపాధ్యాయురాలు, రాశిమెట్ట, జైనూరు

పాఠశాలను ఉద్యానవనంలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషి ఎంతో ఉంది. రెండేళ్లుగా పాఠశాల ఆవరణలో పచ్చదనం పరుచుకునేలా ఎంతో శ్రమపడ్డారు. పిల్లలకు హరిత పాఠాలు బోధించడంతో పాటు హరితవనాల పెంపు అనుభవపూర్వకంగా తెలుసుకునేందుకు విద్యార్థులకు చక్కని అవకాశం లభించింది. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ఆవగతం చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పూట విద్యార్థులు ఆటపాటలతో ఆలసట తీర్చుకుంటున్నారు. విద్యార్థులు తమ సొంత ఇల్లుగా భావించి మొక్కలకు నీరు పోస్తూ కంటికి రెప్పలా సంరక్షించుకుంటున్నారు.

ఆదర్శప్రాయుడు.. ఈ భీముడు



శేఖుగూడ పాఠశాల ఇదే

మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ ఏకోపాధ్యాయ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట్నాక్ భీంరావు కృషి ఫలితంగా కుమురం భీం జిల్లా జైనూరు మండలంలోని శేఖుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రస్తుతం చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. 2015లో ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చినప్పుడు ఒకే తరగతి గది 10 మంది పిల్లలు మాత్రమే ఉండేది. పాఠశాలలో కనీస వసతులు కరవే. అధికారుల సహాయంతో గదుల సంఖ్యను పెంచారు. స్వచ్ఛ భారత్ కింద మంజూరైన మరుగుదొడ్లను చక్కాగా నిర్మించారు. ప్రహరీ లేక పోవడంతో సొంత ఖర్చుతో రూ.10 వేల విలువైన ఫెన్సింగ్ తీగ అమర్చారు. హరితహారంలో భాగంగా ఆవరణలో మొక్కలను నాటారు. వాటి బాధ్యతలను చిన్నారులకు అప్పగించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కమిటీ వేసి విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ.. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. పాఠశాల గోడలను అందమైన చిత్రాలతో తీర్చిదిద్ది.. మహనీయుల ప్రత్యేకతను ఛాయచిత్రాల ద్వారా చాటి చెబుతున్నారు. చిన్నారులు కటిక నేలపై కూర్చోవడం ఇబ్బందిని గమనించి రూ.5 వేలు ఖర్చు చేసి కుర్చీలు కొన్నారు. నాడు మూసివేత దశలో ఉన్న పాఠశాలలో నేడు 35 మంది చిన్నారులు చదువుకుంటున్నారు.



పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీల్లో చిన్నారులు



మనసుంటే మార్గముంది

- కోట్నాక్ భీంరావు, ప్రధానోపాధ్యాయుడు, శేఖుగూడ, జైనూరు

మనసుంటే మార్గముంది. నేటి పిల్లలే రేపటి పౌరులు. విద్యార్థి దశ నుంచి వారిని క్రమశిక్షణతో కూడిన విద్యబోధన, సామాజిక అంశాలపై భాగస్వామ్యం చేయాలి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. తొలుత పాఠశాలలో చక్కని ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని నిర్ణయించాం. తదనుగుణంగా పాఠశాల ఆవరణలో అందరమైన పూల మొక్కలు, నీడనిచ్చే చెట్లు నాటి సంరక్షించుకున్నాం. వృథాగా పోయే నీటిని మళ్లించి కూరగాయలు సాగు చేసి మధ్యాహ్న భోజనంలో రుచికరమైన భోజనం వడ్డించడంతో క్రమేణ పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది.

దేవుడు మెచ్చేట్టు.. ప్రకృతి మురిసేట్టు

పండగలు మన సాంప్రదాయాలకు ప్రతీకలు. ప్రకృతి ఆరాధనకు తార్కాణాలు. భక్తిప్రపత్తులకు వేదికలు. పర్యావరణ పరిరక్షణకు స్వాగత తోరణాలు. మన పూర్వీకులు ప్రతి పండక్కీ ఒక ప్రత్యేకను చూపించారు. ఆ పండగ తెచ్చే సంబరాలు మనతో పాటు మన పర్యావరణానికి ఏ మేరకు మేలు చేస్తాయో వివరించారు. అయితే నేటి తరం పండగల నిర్వహణలో అత్యుత్సాహానికి పోయి పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని నిర్వహిస్తున్న తీరే ఇందుకు నిదర్శనం. సంప్రదాయ మట్టి విగ్రహాలకు బదులు రంగురంగుల రసాయనాలతో సిద్ధం చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి కాలుష్యానికి దారులు తెరుస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ తరుణంలో పర్యావరణాన్ని కాపాడేందుకు నడుం బిగిస్తున్న పలువురు మట్టి వినాయకులే శ్రేష్ఠమని ప్రచారం చేస్తున్నారు. గణేష్ నవరాత్రుల్లో మట్టి ప్రతిమలనే పూజిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ఆదర్శ భక్తులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

- మట్టి గణపతినే పూజిద్దాం..
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు..
- సహజ రంగులే వాడదాం..
- పర్యావరణ పరిరక్షకులు ఈ ప్రకృతి ప్రేమికులు



ఆసిఫాబాద్‌లో ఆకట్టుకుంటున్న ఇందాని రమేష్ తయారు చేసిన మట్టి విగ్రహాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

మన దేశంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే గణేష్ నవరాత్రులు వీధివీధినా సందడిని తీసుకొస్తాయి. సహజంగా లభించే మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయాలి. నవరాత్రుల అనంతరం ఈ విగ్రహాలను జలంలో కలిపాలని పురాణాలు సూచిస్తున్నాయి. దీంతో పంచభూతాల్లో ఒకటైన భూమితోపాటు, జలాన్ని ఆరాధించిన వారవుతారు. నీటిలో సులువుగా కరిగిపోయే మట్టి వినాయకులు జలాన్ని కాని వాతావరణాన్ని కాని ఏవిధంగానూ కలుషితం చేయవు. విఘ్నేశ్వరుడి పూజకు వినియోగించే పూలు, పత్రి, కాయలు, పండ్లు, పాలాకుల విస్తర్లు, నైవేద్యాలు అన్నీ ప్రకృతి ప్రసాదించినవే. భగవంతుని పూజ అంటే ప్రకృతి పూజే అని పెద్దలు వివరిస్తుంటారు. ఇంత చక్కని సంప్రదాయాన్ని విస్మరించి ఆకర్షణ కోసం మట్టి ప్రతిమల స్థానంలో రసాయనాల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తయారు చేసిన విగ్రహాలకు రసాయన రంగులు పూసి పూజలు చేస్తే అది ప్రకృతిని ఆరాధించినట్లు ఎలా అవుతుందని పర్యావరణ వేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఆధునిక ప్రపంచంలో తినే ఆహారం, తాగే నీరు, పీల్చే గాలి ఇలా అన్నీ కలుషితమైపోతున్న తరుణంలో ప్రజల్లో ఇప్పుడిప్పుడే చైతన్యం రగులుతోంది. మట్టి గణపతులనే ప్రతిష్ఠిస్తామని పలు గణేష్ మండళ్లవారు ముందుకు రావడం స్వాగతించాల్సిన విషయం.

పక్క రాష్ట్రాన్ని చూసి ఆచరిద్దాం

జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో రసాయనాలతో గణేష్, దుర్గా విగ్రహాల తయారీపై 2011నుంచి నిషేధం ఉంది. సరిహద్దులోని చంద్రపూర్ జిల్లా కేంద్రంలో మట్టిప్రతిమల తయారీకి ప్రాధాన్యం లభించింది. ఇక్కడ కొన్ని వందల కుటుంబాలు మట్టిప్రతిమల తయారీతో ఉపాధిపొందడంతో పాటు కాలుష్య నివారణకు ఎంతగానో తోడ్పడుతున్నారు. ఇక్కడ ఎవరైనా దొంగచాటుగా రసాయనాలతో విగ్రహాలు తయారు చేసినా స్థానిక ప్రజలే చైతన్యవంతులై ధ్వంసం చేస్తారని చంద్రపూర్‌లో మట్టి విగ్రహాల తయారీదారు గణేష్ 'న్యూస్‌టుడే'తో చరవాణిలో మాట్లాడుతూ వివరించారు. జిల్లా వాసులు ఇక్కడకొచ్చి వచ్చి మట్టి విగ్రహాలను తీసుకెళుతున్నారు.

పల్లె నుంచి పట్టణాలకు వ్యాప్తి..

వాంకిడి మండల ఇందాని గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్ మొదట్లో చవితి పండక్కి తన ఇంట్లో మట్టితో చిన్నచిన్న వినాయక ప్రతిమలను చేసి గ్రామంలో కావాల్సిన వారికి ఇచ్చేవారు. ఇలా దుర్గాదేవీ, శారదా దేవీ విగ్రహాలను తయారు చేయడం మొదలెట్టాడు. గ్రామస్థుల కోరిక మేరకు పెద్ద వినాయక విగ్రహాలను కూడా గత కొద్ది సంవత్సరాలుగా సిద్ధం చేస్తున్నాడు. సమీప గ్రామాల వారు సైతం ఆర్డర్ ఇచ్చి విగ్రహాలను చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇందాని పరిసర గ్రామాల్లో మట్టి వినాయకులను పూజించేవారి సంఖ్య పెరిగింది. దీంతో మట్టి విగ్రహాల ప్రచారాన్ని పట్టణాలకు విస్తరించాలన్న ఆలోచనకు వచ్చారు. ఇందానిలోనే మహారాష్ట్రకు చెందిన విగ్రహ తయారీ కళాకారుల సహాయంతో ఆకర్షణీయమైన మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. రమేష్ కుమారులు రవి, ప్రశాంత్‌లు ఆసిఫాబాద్, మండల కేంద్రం వాంకిడిలో ఈ విగ్రహాలను ప్రదర్శనకు పెట్టారు.



లయన్స్‌క్లబ్ వారు ఉచితంగా..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆసిఫాబాద్ లయన్స్‌క్లబ్ వారు గత మూడేళ్లుగా వినాయక చవితి రోజున వందలాది మంది భక్తులకు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కాలుష్య నివారణ కోసం అందరూ మట్టివినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించాలని ప్రచారం చేపట్టారు.



విగ్రహం కోసం మహారాష్ట్రకు..

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా రాష్ట్రీయ రహదారి పక్కన వివేకానంద గణేష్ మండలి వారు ఏర్పాటు చేస్తున్న గణేష్ మట్టి విగ్రహాన్ని మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి తీసుకొస్తున్నారు. అక్కడైతే కోరిన రూపాల్లో ప్రతిమకు ఏ రంగూ వేయకుండా మట్టి రంగులోనే ఆకట్టుకొనే విధంగా తయారు చేస్తారు. గతేడాది నిమజ్జనం రోజున ఉత్సవ సమితి వారు నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ఈ మట్టి వినాయకునికి బహుమతి లభించింది. పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ గణేష్ మండలి అధ్యక్షులు కాంద్రె విశాల్ మాట్లాడుతూ కేవలం భక్తే కాదు, పర్యావరణ రక్షణ కూడా ముఖ్యమే అంటున్నారు.



నాలుగేళ్లుగా మట్టి విగ్రహమే

- ఆర్.కృష్ణమూర్తి, గణేష్‌మండలి ఎన్జీవోస్ కాలనీ

మా కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించినప్పటి నుంచి మట్టి వినాయకుడినే ప్రతిష్ఠిస్తున్నాం. జిల్లా కేంద్రంలో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న మాల్కడి తుకారాం వద్ద ఆర్డర్ ఇచ్చి మట్టి వినాయకులను కొనుగోలు చేస్తున్నాం. భక్తితో చేస్తున్న ఈ కార్యక్రమంతో మనుషులకు మేలు కలగాలే కాని కీడు కాకూడదని రసాయనాలతో తయారైన విగ్రహాల జోలికి వెళ్లడం లేదు.



మట్టి వినాయకులే శ్రేష్ఠం

- ఇందారపు మధుకర్ శర్మ, ప్రధాన అర్చకులు

పురాణాల ప్రకారం చూసినా పూజకు మట్టి వినాయక ప్రతిమలే శ్రేష్ఠం. పంచభూతాల స్వరూపుడైన విఘ్నేశ్వరుడు ప్రకృతి ప్రేమికుడు. చెరువు మట్టిని తెచ్చి విగ్రహం చేయడం ఆనవాయితీ. ఆయనకు ప్రకృతిలో లభించే 21 రకాల పూలు, ఆకులతో పూజలు చేస్తారు. విగ్రహానికి ఔషధ గుణాలు వస్తాయి. ఆ విగ్రహాన్ని తిరిగి చెరువు నీటిలో వేయడంతో ఆ నీటికి, మట్టికి శక్తి వస్తుంది. ఏ విధంగా చూసినా మట్టి ప్రతిమలే మంచిది.



ఇరవై ఏళ్లుగా మట్టి ప్రతిమలు సిద్ధం చేస్తున్నారు..

కుమురం భీం జిల్లా కేంద్రంలో మాల్కడి తుకారాం కుటుంబం ఇరవై ఏళ్లుగా మట్టి గణేష్ విగ్రహాలను తయారు చేస్తూ కాలుష్య నివారణకు తోడ్పాటునందిస్తున్నారు. ఈ ప్రాంతంలో పీవోపీ, రసాయనాలతో అందంగా తయారు చేస్తున్న విగ్రహాలతో పోటీపడి తన కళను ప్రకృతికి విరుద్ధంగా ఉపయోగించేది లేదన్న కట్టుబాటుతో తుకారాం ఆదర్శంగా నిలుస్తున్నారు. వినాయక ప్రతిమలతో పాటు దేవీ నవరాత్రుల సమయంలో దుర్గామాత, శారదామాత విగ్రహాలను సైతం మట్టితో తయారు చేసి ఈప్రాంతంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా లభించే ఎర్రమట్టి, వరిగడ్డి, చెక్కలు, గోనె సంచులు, నీటి రంగులతో విగ్రహాలను ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు.



సంకల్పమే గెలిచింది

- చిన్నతనంలోనే చూపును కోల్పోయిన అనిల్
- పట్టుదలతో ఉన్నత విద్యలో రాణిస్తూ...

దహెగాం, న్యూస్‌టుడే

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు మహాపురుషులవుతారు.. అన్నాడు ఓ కవి. మనిషి ఎదుగుదలకు కృషి, పట్టుదల, సంకల్పం ఉంటే ఎంతటి మహత్తరమైన పనినైనా సాధించవచ్చు. అలాంటి కోవకే చెందుతాడు దహెగాం మండల కేంద్రానికి చెందిన పందిర్ల అనిల్. చిన్నతనంలోనే చూపును కోల్పోయాడు. నేను ఏమి చేయలేను అనే నిరాసక్తతకు లోనుకాకుండా కష్టపడి విద్యలో రాణించాలని పట్టుదలతో కుటుంబ సభ్యుల సహకారంతో అంచెలంచెలుగా విద్యనభ్యసిస్తూ ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్నాడు.

దహెగాం మండల కేంద్రానికి చెందిన పందిర్ల రాజేశ్వరి-బాపు దంపులది పేద కుంటుంబం. వీరికి అయిదుగురు సంతానం. అందులో రెండోవాడైన అనిల్ చిన్నతనంలోనే ఇంటి వద్ద చోటు చేసుకున్న చిన్న ప్రమాదంలో కండ్లకు దెబ్బ తగలింది. శస్త్ర చికిత్స చేయించినా చూపురాలేదు. 1వ తరగతి నుంచి అయిదో తరగతి వరకు దహెగాం ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాడు. ఆరు నుంచి 10వ తరగతి కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అంధుల పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లోని చిన్నజీయర్‌స్వామి నేత్ర విద్యాలయంలో పూర్తి చేశాడు.

చూపు లేకున్నా విద్యలో చురుగ్గా ఉంటూ పలువురి మన్ననలు పొందుతూ ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్నాడు. తోటి విద్యార్థులతో పోటీ పడి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాడు. అనిల్ బ్రెయిలీ లిపి సాఫ్ట్‌వేర్ ఆధారంగా కంప్యూటర్‌ను అవలీలగా ఆపరేట్ చేస్తున్నాడు.

ఆటల్లోనూ మేటి...

అనిల్ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. తాను పాఠశాల, కళాశాలల్లో నిర్వహించిన చెస్, క్రికెట్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను కైవసం చేసుకున్నాడు. కరీంనగర్ అంధుల పాఠశాలలో చదివే సమయంలో నిర్వహించిన చెస్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి అప్పటి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని కూడా అందుకున్నాడు. ఏరోజు కూడా నిరాసక్తతకు లోనుకాకుండా విద్యతో పాటు క్రీడల్లో చురుకుగా పాల్గొంటాడు. తన కుమారుడు అంధుడని ఏమి చేయలేడని మేం అధైర్య పడలేదని ఆనందంతో చెబుతున్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో పాటు గురువుల ప్రోత్సాహంతో ఈ విజయాలను సాధిస్తున్నానని అనిల్ గర్వంగా చెబుతున్నాడు. ఇష్టపడి చేస్తే ఏదీ కష్టం కాదని చెప్పుకొచ్చాడు.



తొలిపొద్దు పొడిచింది

- నాడు గుడుంబా తయారీ.. నేడు స్వయం ఉపాధి
- ప్రభుత్వ చేయూతతో మారిన జీవితాలు

వాంకిడి, బెజ్జూర్, న్యూస్‌టుడే

వారంతా గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా(నాటు సారా)ను తయారు చేస్తూ రహస్యంగా విక్రయించుకుంటూ జీవనోపాధి పొందేవారు. చేసే పని చెడు అని తెలిసినా ఇతర పనులు చేయలేక, ఆర్థిక స్తోమతు సహకరించక ఈ పనినే చేసేవారు. ప్రభుత్వం గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. గుడుంబా స్థావరాలపై దాడులు, విక్రయించే వారిపై కేసులు నమోదు చేసింది. సారా తయారు చేసే కుటుంబాలకు ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పించి ఆదుకునేందుకు రూ.2 లక్షలు విలువ చేసే యూనిట్లను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వం సాయాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి పొందుతూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. వారి జీవితాల్లో వచ్చిన మార్పులపై 'న్యూస్‌టుడే' కథనం.

కుమురం భీం జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజవర్గంలోని మండలాల్లోని గిరిజన తండాలు, గూడాల్లో గుడుంబా విక్రయించే 46 మందిని గుర్తించి వారికి రూ.92 లక్షల విలువ చేసే యూనిట్లను మంజూరు చేశారు. స్వయం ఉపాధి పొందేందుకు ఆటోలు, కిరాణా దుకాణాలు, ఫొటో స్టూడియో, మేకలను మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే కొన్ని మండలాల్లో యూనిట్లు అందించగా మరికొన్ని మండలాల్లో అందజేయాల్సి ఉంది. ఆర్థిక సాయం పొందిన వారు మూడేళ్ల పాటు గుడుంబా విక్రయాలు చేపట్టనని హామీ పత్రం ఇవ్వడంతో పాటు, ఆయా మండలాల తహసీల్దార్ల ముందు బైండోవర్ చేశారు. ఒక వేళతిరిగి గుడుంబా విక్రయించినట్లు తేలితే రూ. లక్ష జరిమానా విధించి, అందించిన డబ్బులను రికవరీ చేస్తారు.

46 యూనిట్లు పంపిణీ

గుడుంబా తయారీ మానేసిన వారికి ప్రభుత్వం అందించే సహాయం డబ్బుల రూపంలో ఇస్తే ఉపయోగం లేకుండా పోతుందన్న ఉద్దేశంతో ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలోనే లబ్ధిదారులు కోరుకున్న యూనిట్లను స్వయంగా కొనుగోలు చేసి ఇచ్చారు. జిల్లాలోని వాంకిడి, ఆసిఫాబాద్, తిర్యాణి, రెబ్బెన, బెజ్జూర్, దహెగాం, సిర్పూర్‌టి మండలాల్లోని గుడుంబా తయారీ మానేసిన వారిని ఎంపిక చేసి యూనిట్లను మంజూరు చేశారు. ప్రభుత్వం యూనిట్ల రూపేణా అందించిన రూ.2 లక్షలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు.

కుమురం భీం జిల్లాలో మంజూరైన యూనిట్లు	
ఆసిఫాబాద్:	సిర్పూర్:
17	29



గౌరవంగా జీవిస్తున్నారు..

ఈ చిత్రంలో ఆటో పక్కన నిలబడ్డ వ్యక్తి బెజ్జూర్ మండలం లంబడితాండ(మర్తిడి)కి చెందిన ధారావత్ బద్రి. గతంలో గుడుంబా తయారు చేస్తూ జీవనోపాధి పొందేవాడు. గుడుంబా తయారీ వృత్తిని వదులుకోవాలని పోలీసులు, ఆబ్కారి శాఖాధికారులు సూచించడంతో తయారీని వదులుకున్నాడు. గుడుంబా తయారీ మానుకున్న వారికి ప్రభుత్వం ఇచ్చే సహాయంలో భాగంగా ఇతనికి ఆటో యూనిట్‌ను మంజూరు చేశారు. ప్రస్తుతం ఆటో నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. ఇప్పుడు గౌరవంగా జీవిస్తున్నాడు.

గుడుంబా తయారీ మానేసిన కుటుంబాలను ఆదుకుంటాం

- ఎండీ మోహసిన్ అలీ, సీఐ, ఆసిఫాబాద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు గుడుంబా తయారీ మానేసిన వారిని గుర్తించి, వారు స్వయం ఉపాధి పొందేందుకు యూనిట్లను అందజేశాం. మొదటి విడతగా గుర్తించిన వారికి యూనిట్లు అందజేశాం. లబ్ధిదారుల నుంచి గుడుంబా తయారీని మానేస్తున్నట్లు హామీ పత్రాన్ని తీసుకున్నాం. తహసీల్దార్ ముందు బైండోవర్ చేశాం. ఒక వేళ యూనిట్ పొందాక, తిరిగి గుడుంబా తయారు చేస్తే వారికి లక్ష జరిమానాతో పాటు ఇచ్చిన రుణాన్ని రికవరీ చేస్తాం.



మేకల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటూ..

ఈ చిత్రంలో ఉన్న మహిళ రాహటె సుమన్‌బాయి. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే పదేళ్ల కిందట భర్త చనిపోయాడు. కొంతకాలం వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేది. మూడేళ్ల కిందట గుడుంబా తయారు చేసి అమ్మేది. చాలా సార్లు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వ సహాయంతో మేకలు పెంపకంతో గౌరవంగా కుటుంబాన్ని పోషిస్తోంది.



ఆటో కోసం దరఖాస్తు చేసుకున్నా..

ఈయన పేరు భుక్యా దేవాజీ. గుడుంబా తయారీ మానేసిన వారికి ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలుసుకొని సంతోషపడ్డాడు. ఆటో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. యూనిట్ మంజూరు చేస్తే గౌరవంగా బతుకుతానని సంబరపడుతున్నాడు.



ముడుచుకుంటే సాధారణం.. రెక్కలు విప్పితే ఎంతందం..!!

సీతాకోక చిలుక సాధారణ స్థితిలో ముడుచుకొని ఉన్నప్పుడు చూస్తే మామూలుగానే కనిపిస్తుంది. అలాంటి పరిస్థితిలో మన కళ్లకు అది ఎక్కువగా కనిపించదు. రెక్కలు విప్పుకొని రెపరెపలాడుతున్నప్పుడు మాత్రం ఆ అందం చూసేందుకు రెండు కళ్లు చాలవనిపిస్తుంది. మామడలో ఒక సీతాకోక చిలుక కొద్ది వ్యవధిలోనే ఇలా రెండు రూపాల్లో కనపించిన దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది.

క్లిక్... క్లిక్

- న్యూస్‌టుడే, మామడ



నేటి చిత్రం

నాడు హోదా.. నేడు వృథా

స్కూటర్.. ఒకప్పుడు మధ్యతరగతి ప్రజలకు ఇది కలలవాహనం. కుటుంబ వాహనంగా ఎంతోమంది అభిమానాన్ని చూరగొన్నది. కాలక్రమంలో వచ్చిన మార్పులకు ఇది నేడు ఇదిగో ఇలా వృథా కిందకు వచ్చేసింది. లూనాపై గ్రామాల్లో తిరుగుతూ తుక్కును సేకరించే ఓ చిరువ్యాపారి పాడైపోయిన ఓ స్కూటర్‌ను కొనుగోలుచేసి తన వాహనంపై తీసుకెళ్తున్న దృశ్యం బుధవారం జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ సమీపంలో 'న్యూస్‌టుడే' తన కెమెరాకు చిక్కింది.

- న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

కార్ఫ్‌బాల్ అండర్-17, 19 జిల్లా జట్ల ఎంపిక

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కార్ఫ్‌బాల్ జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల స్థాయి(జోనల్‌స్థాయి) పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని మాత్రమే జట్లకు ఎంపిక చేశామన్నారు. అండర్-17 క్రీడాకారులకు ఆదిలాబాద్‌లోనే రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని, అండర్-19 క్రీడాకారులకు హైదరాబాద్‌లో వచ్చే నెలలో ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు పక్షం రోజుల పాటు జిల్లా కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్, బోనాఫైడ్, జనన ధ్రువీకరణ పత్రాలు సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. ఈ జట్లకు శిక్షకులుగా జె.రాష్ట్రపాల్, జె.సాయికుమార్ వ్యవహరిస్తారని తెలిపారు.

అండర్-17 జిల్లా జట్టు: ఎం.శివాణి, సంజన, ఎం.ఉర్మిళ, పి.పూజ, సంబుద్ధ, లక్ష్మణ్, ఆశిష్‌మణి, సమీర్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.1 ఆదిలాబాద్), హెచ్.కె.భూమిక, ఎన్.నమ్రత, వంశీ(గౌతమ్ మోడల్ స్కూల్, ఆదిలాబాద్), ఎం.అవంతిక(సెయింట్ థామస్ ఉన్నత పాఠశాల నిర్మల్), టి.మానస, రాకేశ్(జడ్పీఎస్ఎస్ పెండల్‌వాడ), ప్రణిత్(కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆదిలాబాద్), సతీశ్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2 ఆదిలాబాద్). స్టాండ్‌బైలుగా పల్లవి, సుప్రియ, సందేశ్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.1 ఆదిలాబాద్), ప్రశాంత్(గౌతమ్ మోడల్ స్కూల్ ఆదిలాబాద్)

అండర్-19 జిల్లా జట్టు: జె.మానస, కె.సుశ్మిత, సాయిపుష్ప, సంధ్యారాణి, పల్లవి, అవంతిక, సంగీత, మనీష(టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఆదిలాబాద్), నందకుమార్, శివప్రసాద్, వినయ్, పృథ్వీ, అక్షయ్(విద్యార్థి జూనియర్ కళాశాల ఆదిలాబాద్), నితీన్, షేక్ రియాజ్(నలంద జూనియర్ కళాశాల ఆదిలాబాద్), రాకేశ్(పూలాజీబాబా జూనియర్ కళాశాల ఉట్నూరు). స్టాండ్‌బైలుగా ద్రుపద, ఎం.మనీష(టీఎస్‌డబ్ల్యూఆర్ జేసీ, ఆదిలాబాద్).



ఎంపికైన అండర్-17 కార్ఫ్‌బాల్ జిల్లా జట్టు



అండర్-19 కార్ఫ్‌బాల్ జిల్లా జట్టు

నిండిన కడెం... ముమ్మరంగా వరి నాట్లు

ఖరీఫ్ పనుల్లో రైతుల నిమగ్నం

దండేపల్లి, న్యూస్‌టుడే: నిన్నటి వరకు చుక్క నీరు లేక బీళ్లుగా ఉన్న భూములు... ఈ ఖరీఫ్‌లో నాటు వేస్తామో లేదో పంటలు పండుతాయా లేదో అని ఆందోళన వ్యక్తం చేసిన రైతుల్లో ఆనందం నెలకొంది. జిల్లావ్యాప్తంగా రెండు రోజుల కిందట కురిసిన వర్షాలతో కడెం జలాశయం నిండటంతో పాటు వ్యవసాయ బావులు, వాగులు, చెరువుల్లోకి నీరు రావడంతో ఖరీఫ్ పనులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ప్రస్తుతం చాలా చోట్ల రైతులు పొలాలను నాటుకు సిద్ధం చేయడం, నాటు వేయడం తదితర పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. కడెం జలాశయం కింద జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలో 40వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో కనీసం సగం కూడా నాట్లు పూర్తి కాలేదు. రెండు రోజుల కిందట కురిసిన వర్షాలతో కడెం జలాశయం నిండి కాల్వలకు సమృద్ధిగా నీరు వదలడంతో ఆయకట్టుతో పాటు చెరువులు, వాగుల కింద నాట్లు ఊపందుకున్నాయి. రైతులు పొలం పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు.



పొలం దున్నుతున్న రైతు



నాటు వేసేందుకు నారు తీసుకుని వెళ్తున్న మహిళలు



డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా వస్తున్న కడెం నీరు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి: ఎంవీఐ

అట్టహాసంగా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

ఏసీసీ, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. చదువుతో పాటు ఇతర క్రీడారంగాల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా సీఐ సుధాకర్‌తో పాటు ఆయన హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందాలంటే ఆటలు తప్పనిసరి అన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అతిథులు కొద్దిసేపు ఫుట్‌బాల్ ఆడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మందికి పైగా క్రీడాకారులు తరలివచ్చారు. మైదానంలో తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. జిల్లా విద్యాధికారి రవికాంత్‌రావు ఆదేశాల మేరకు విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రేని రాజయ్య అధ్యక్షతన మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో డీటీడీఓ గంగారాం, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, సాక్షర భారత్ జిల్లా బాధ్యుడు పురుషోత్తం నాయక్, మండల విద్యాధికారి దాసరి శ్రీనివాస్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బీజుకరువిల్లా, మంచిర్యాల స్పోర్ట్స్‌క్లబ్ కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ, పీఈటీ సంఘం నాయకులు మీనారెడ్డి, బెల్లం శ్రీనివాస్, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పోటీలను పురస్కరించుకుని ఇటీవల బదిలీ అయిన మంచిర్యాల సీఐ సుధాకర్‌ను క్రీడా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంవీఐ వివేకానందరెడ్డి, సీఐ సుధాకర్ తదితరులు



ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన క్రీడాకారులు